


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 248 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : తాడేపల్లిగూడెం గురువారం 16 జూలై 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 248 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : THADEPALLI GUDEM THU 16 JULY 2026 PRICE : 1/- RS


Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur

## ముద్రగడ పాడె మోసిన జగన్



మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం భౌతిక కాయానికి వైసీపీ అధినేత జగన్ నివాళులర్పించారు. ముద్రగడ కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పిన జగన్, కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ముద్రగడ పార్థివ దేహానికి రాజకీయ ప్రముఖులు, ప్రజలు, అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చి నివాళులర్పిస్తున్నారు. కాసేపటి క్రితం ముద్రగడ అంత్యక్రియలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ముద్రగడ పాడెను జగన్, వైసీపీ కీలక నేత బొత్స సత్యనారాయణ మోశారు.



## ఒకరోజు 'మావిగన్', ఇంకోరోజు 'బెంతాహై'..

### జగన్‌పై మంత్రి లోకేశ్ సెటైర్లు

- జగన్ రోజుకో మాట మార్చుతారంటూ విమర్శలు
- రాయలసీమ అభివృద్ధికి జగన్ ఒక క్యాన్సర్ గడ్డలా మారారని వ్యాఖ్యలు
- వైసీపీ ఒక హిట్ అండ్ రన్ పార్టీ అంటూ తీవ్ర ఆరోపణలు
- పరిశ్రమలను బెదిరించి, యువతకు ఉద్యోగాలు ఇవ్వకుండా మోసం చేశారని ఆగ్రహం

పెన్ పవర్ డెస్క్:వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి రోజుకో మాట, పూటకో వేషం వేస్తుంటారని, ఒకరోజు 'మావిగన్' అంటే, మరోరోజు 'బెంతాహై' అంటారని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో తాము చట్టప్రకారం పాలన చేస్తుంటే, లా అండ్ ఆర్డర్‌ను చేతుల్లోకి తీసుకోవాలని చూస్తే ఎవరినీ వదిలిపెట్టబోమని హెచ్చరించారు. కడప జిల్లా జమ్మలమడుగు

- మిగతా 2లో

### అది రాష్ట్ర ద్రోహం, దేశ ద్రోహంతో సమానం:

## సీఎం చంద్రబాబు





- మూడేళ్లలో 36 సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటన
- రూ. 35 వేల కోట్ల బడ్జెట్‌తో పనులు చేపడతామని వెల్లడి
- రాష్ట్ర జీవనాడి పోలవరం ప్రాజెక్టును మార్చి 2027 నాటికి పూర్తి చేస్తామని స్పష్టం
- గత ఐదేళ్లలో ప్రాజెక్టుల నిర్వహణ పూర్తిగా విఫలమైందని విమర్శలు
- కేఎల్ రావు జయంతి, పట్టిసీమ జలహారతి కార్యక్రమంలో కీలక హామీలు

- మిగతా 2లో

### విమర్శలే కాదు.. మోసాన్ని మ్యూజియంలో పెడతా

"వెలిగొండ ప్రాజెక్టు పనులు పూర్తికాకుండానే, సొరంగంలో యంత్రి ఇరుక్కుపోయిన విషయాన్ని, దాచిపెట్టి, ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తున్నట్లు బోర్డు పెట్టి నాటకాలాడారు. ప్రజలను ఇంత దారుణంగా మోసం చేస్తారా? వారి మోసానికి ప్రతీకమైన ఆ ప్రాదంభోత్సవ బోర్డును మ్యూజయంలో పెట్టి, ప్రజలకు శాశ్వతంగా గుర్తుండేలా చేస్తాను.

2019-24 మధ్య కాలంలో ప్రాజెక్టుల నిర్వహణ పూర్తిగా విఫలమైందని, గేట్లకు కనీస నిర్వహణ కూడా చేయలేదని ఆరోపించారు. కాంట్రా క్టర్ల కు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు నిలిచిపోయాయని పేర్కొన్నారు.




### 36 ప్రాజెక్టులు, 3 సంవత్సరాలు

రాబోయే మూడేళ్లలో రాష్ట్రంలోని 36 కీలక సాగునీటి ప్రాజెక్టులను రూ.35 వేల కోట్ల వ్యయంతో పూర్తి చేస్తాం

| | |
|---|---|
| పోలవరం ప్రాజెక్టు | – 2027 మార్చి నాటికి పూర్తి |
| వెలిగొండ ప్రాజెక్టు (తొలిదశ) | – 2025 సెప్టెంబర్ 1న ప్రారంభం |
| గుంటూరు ఛానల్ ఆధునీకీకరణ | – 2026 జూన్ నాటికి పూర్తి |
| చింతలపూడి ఎత్తిపోతల | – 2026 ఆగస్టు కల్లా పూర్తి |
| వరికపూడిశెల ప్రాజెక్టు | – 2027 జూన్ నాటికి పూర్తి |

### మహనీయుల స్ఫూర్తితో ముందుకు



డా. కేఎల్ రావు | సర్ ఆర్థర్ కాటన్ | శివరామకృష్ణయ్య | నందమూరి తారకరామారావు

ధవళేశ్వరం, తుంగభద్ర బ్యారేజీల గేట్ల మరమ్మతులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టామని తెలిపారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో నీటిని పొదుపుగా వినియోగించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.



### చంద్రబాబు సానుభూతిపరులు

## సిండికేట్‌గా ఏర్పడి రైతులను దోచుకుంటున్నారు

- భీమవరంలో ఆక్వా రైతులతో జగన్ ముఖాముఖి
- ఫీడ్, సీడ్ రేట్లను చంద్రబాబు మనుషులే ఫైనల్ చేస్తారని విమర్శ
- చంద్రబాబు ప్రతి అడుగు మోసమేనని మండిపాటు

పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలో ఆక్వా రంగం సమస్యల సుడిగుండంలో ఉందని, ఆక్వా రైతులు దీనావస్థలో ఉన్నారని వైసీపీ అధినేత జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. భీమవరంలో ఆక్వా రైతులతో ముఖాముఖి సమావేశం నిర్వహించిన జగన్... ఇష్టానుసారం ఫీడ్ ధరలు పెంచుకుంటూ పోతున్నారని ఆరోపించారు. ధరల పెరుగుదలకు హేతుబద్ధత ఉండాలని, ఒక్క పంటకు కూడా గిట్టుబాటు ధర లేదని విమర్శించారు. దున్నపోతు

- మిగతా 2లో



## అమరావతి 2.0 మాస్టర్ ప్లాన్...

## సింగపూర్ ప్రతినిధులతో సీఎం చంద్రబాబు సమీక్ష

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ ఆర్థిక ప్రగతికి చోదక శక్తిగా, ప్రపంచ స్థాయి నగరంగా అమరావతిని తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంలోని నలుమూలల నుంచి ప్రజలు వచ్చి నివసించేలా రాజధాని ఇంటిగ్రేటెడ్ మాస్టర్ ప్లాన్ ఉండాలని ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. అమరావతి 2.0 ఇంటిగ్రేటెడ్ మాస్టర్ ప్లాన్, ల్యాండ్ పూలింగ్ స్కీమ్ పనుల పురోగతిపై ఆయన ఉన్నతాధికారులు, సింగపూర్ ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు

- మిగతా 2లో

## క్రిప్టోపై ఆ వార్తలు అవాస్తవం.. కేంద్రం క్లారిటీ



పెన్ పవర్ డెస్క్:క్రిప్టో కరెన్సీని నియంత్రించే అంశంపై ఆలోచించాల్సిందిగా ఆర్‌బీఐ, సెబీలను ఆర్థిక మంత్రిత్వ శాఖ సూచించినట్లు సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# జగన్ 'ఇలా.. ఇలా..' : చంద్రబాబు మరోలా!

రాజకీయ నేతలకు తమ మాటే ఒక ఆయుధం. బాడీ లాంగ్వేజ్ (వ్యవహారశైలి/ఆహార్యం) ప్రజలను కనెక్ట్ చేసే బలమైన వారధి. వేదికపైకి రాగానే చేసే చిన్న సైగ, పదే పదే పలికే ఒక పదబంధం, లేదా ఒక ప్రత్యేకమైన శైలి ఆ నాయకుడికి ప్రజల్లో ఒక ప్రత్యేక బ్రాండ్ ఇమేజ్‌ను క్రియేట్ చేస్తాయి. తాజాగా భీమవరం సభలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తనదైన ట్రేడ్ మార్క్ శైలిలో అక్వా రైతుల సమస్యలను ఎలుగెత్తి చాటారు. అక్వా రైతుల సమస్యలను తెలుసుకునేందుకు పశ్చిమగోదావరి జిల్లాలో పర్యటించిన జగన్ ప్రభుత్వం చెప్పిన విధంగా ఫీడ్, సీడ్ ధరలు తగ్గలేదని నిరూపించేందుకు రైతులతో 'ఇలా.. ఇలా.. ఇలా..' చేతులు ఊపండని జగన్ చెప్పించారు. ఈ సన్నివేశం అందరినీ ఆకట్టుకుంది. ఈ క్రమంలో తెలుగు రాష్ట్రాల్లో నేతలు ఒక్కొక్కరిది ఒక్కోస్టైల్ అంటూ చర్చ జరుగుతోంది.

**జగన్మోహన్ రెడ్డి : పదే పదే.. గట్టిగా..**

మాజీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి ప్రసంగాల్లో ఒక లయ ఉంటుంది. ప్రభుత్వాన్ని విమర్శించేటప్పుడు ఒక పదాన్ని రెండు మూడు సార్లు నొక్కి చెప్పడం ఆయన అలవాటు. "ఇలా.. ఇలా.. ఇలా..", "గట్టిగా చేతులు ఊపండి" అంటూ కార్యకర్తలను ఉత్సాహపరచడం, సభలో జోష్ నింపడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. తన ప్రసంగాల్లో భావోద్వేగాలను పండించడంలో, ప్రత్యర్థులపై విమర్శనాస్త్రాలను గుప్పించడంలో జగన్ తనకంటూ ఒక ప్రత్యేకమైన శైలిని ఏర్పరచుకున్నారని చెబుతుంటారు.

**చంద్రబాబు స్టైల్ విక్టరీ**

ఇక ముఖ్యమంత్రి చంద్రబాబు తనదైన హుందాతనంతో ప్రజలకు అభివాదం చేస్తుంటారు. వేదికపై ఎక్కగానే రెండు వేళ్లతో 'విక్టరీ సింబల్' చూపడం ఆయన ట్రేడ్ మార్క్. ఇది కేవలం ఒక సైగ మాత్రమే కాదు, కార్యకర్తల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపే ఒక సంకేతం. దశాబ్దాల రాజకీయ ప్రస్థానంలో చంద్రబాబును చూడగానే అభిమానులు సైతం విక్టరీ సింబల్ చూపుతుంటారు. తెలుగు నేలపై మరే నేతకు ఇటువంటి అభివాదం ఉండదు. చంద్రబాబు మాదిరిగానే టీడీపీ నాయకులు, కార్యకర్తలు సైతం విక్టరీ సింబల్ తోనే అభివాదాలు చేస్తుంటారు.

**వైఎస్ రాజశేఖరరెడ్డి : కుయ్.. కుయ్..**

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి మాట తీరులో ఉండే నేర్పు, ప్రజలకు అర్థమయ్యే సరళత అద్భుతం. ఆయన ప్రసంగాలంటేనే ఒక భరోసా. ఉదాహరణకు, 108 అంబులెన్స్ సేవలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి ఆయన చెప్పిన "కుయ్.. కుయ్.. కుయ్.. అంటూ అంబులెన్స్ వస్తుంది" అనే మాట ఇప్పటికీ అందరికీ గుర్తే. సంక్లిష్టమైన పథకాలను కూడా సామాన్యుడికి అర్థమయ్యేలా, తన మాటలతో వారి మనసు గెలుచుకోవడం వైఎస్సార్‌కే చెల్లిందని ఆయన అభిమానులు చెబుతుంటారు.

**కేసీఆర్: యాసలో ఆత్మగౌరవం**

తెలంగాణకు చెందిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఉపన్యాస శైలిని ఎవరూ అనుకరించలేరు. తెలంగాణ యాసను, సంస్కృతిని తన మాటల్లో జోడించి, ప్రజల్లో ఆత్మగౌరవాన్ని రగిల్చడం ఆయన ప్రత్యేకత. చమత్కారాలు, వ్యంగ్యాస్త్రాలు, పురాణ గాథలు, ఉర్దూ, తెలుగు పదాల మిశ్రమంతో ఆయన చేసే ప్రసంగాలు సభికులను కట్టిపడేస్తాయి. "ఏం జరగాలి?", "ఏం కావాలి?" అని ఆయన పలికే తీరులో ఒక రకమైన ఆవేశం, వాదన కనిపిస్తుంది.

**రేవంత్ రెడ్డి: దూకుడు.. ఆవేశం**

ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగాల్లో దూకుడు కనిపిస్తుంది. ఆయన మాటల్లో ఆవేశం, వాస్తవాలను ఎత్తిచూపే ధైర్యం ఉంటాయి. ప్రత్యర్థులను అడ్రస్ చేసే విధానం, ప్రజల సమస్యలపై స్పందించే తీరులో ఒక రకమైన 'కౌంటర్' ఫాలో అవుతుంటారు. ప్రజలతో నేరుగా కనెక్ట్ అయ్యేందుకు ఆయన వాడే భాష, ఉపయోగిస్తున్న బాడీ లాంగ్వేజ్ ఆయనకు యువతలో ఒక ప్రత్యేక క్రేజ్‌ను తెచ్చిపెట్టాయి.

నాయకుల వ్యవహారశైలి గమనిస్తే బహిరంగ సభలు లేదా సమావేశాల్లో నాయకుడు చెప్పే అంశం ఎంత ముఖ్యమో, దాన్ని ప్రజల్లోకి ఎలా తీసుకెళ్తున్నారనేది అంతకంటే ముఖ్యమని అంటున్నారు. తమదైన హావభావాలు, ట్రేడ్ మార్క్ మాటలతో ప్రజల మనసుల్లో చెరగని ముద్ర వేసుకోవడం మన నేతల నైజం అంటున్నారు.

# క్రిప్టోపై ఆ వార్తలు అవాస్తవం.. కేంద్రం క్లారిటీ

- మొదటి పేజి తరువాయి

ప్రచారాన్ని కేంద్రం ఖండిం చింది. అవన్నీ అవాస్తవాలని కొట్టిపారేసింది. అలాంటి ప్రతిపాదనలేవీ లేవని స్పష్టం చేసింది. ఈ మేరకు పీఐబీ ఫ్యాక్ట్ చెక్ విభాగం ఎక్స్ వేదికగా స్పందించింది. క్రిప్టో కరెన్సీపై ఆర్థిక మంత్రిత్వ శాఖ నుంచి ఎలాంటి ఆదేశాలు జారీకాలేదని కేంద్రం పేర్కొంది. క్రిప్టోను ఒక చట్టబద్ధమైన ఆస్తిగా పరిగణించడం లేదని స్పష్టం చేసింది. ఇలాంటి వదంతులను నమ్మొద్దని తెలిపింది. విశ్వసనీయం సమాచారం కోసం అధికారిక వెబ్‌సైట్‌లనే సందర్శించాలని సూచించింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా తప్పుడు కథనాలు వ్యాప్తి జరిగినప్పుడు వెంటనే కేంద్రం దృష్టికి తీసుకురావాలని కోరింది. ఇందుకు 091 8799711259 నంబర్‌కు కాల్ చేసి తెలియజేయాలని లేదంటే factcheck@pib.gov.in మెయిల్ చేయాలని సూచించింది.

## ఆ సబ్ రిజిస్ట్రార్ రూటే సెపరేటు... ఎపిసోడ్ -2

# ఇక్కడ నేనే రూల్...

- భీమడోలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై వివాదం..
- ప్రైవేట్ సిబ్బందితో విధులు, ప్రజలకు ఇబ్బందుల ఆరోపణలు
- ప్రభుత్వ కార్యాలయంలో ప్రైవేట్ వ్యక్తుల జోక్యం..?
- ప్రభుత్వ ఉద్యోగులను పక్కనబెట్టి ప్రైవేట్ సిబ్బందితో విధులు
- రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన ప్రజలకు వేధింపుల ఆరోపణలు
- సున్నితమైన ప్రభుత్వ రికార్డులు, బయోమెట్రిక్ ప్రక్రియలపై ప్రశ్నలు
- 'ఇక్కడ నేనే రూల్' అన్నట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు
- స్వతంత్ర విచారణకు ప్రజలు, బాధితుల డిమాండ్

**ఏలూరు జిల్లా భీమడోలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రభుత్వ ఉద్యోగుల స్థానంలో ప్రైవేట్ వ్యక్తులతో ప్రభుత్వ విధులు నిర్వహింపజేస్తున్నారనే ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీశాయి. ప్రజలకు రిజిస్ట్రేషన్ సేవలు అందించాల్సిన కార్యాలయంలో ప్రైవేట్ వ్యక్తుల ప్రమేయం, వినియోగదారుల పట్ల అనుచిత ప్రవర్తన, ప్రభుత్వ రికార్డుల నిర్వహణపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ ఆరోపణలపై సంబంధిత ఉన్నతాధికారులు స్వతంత్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని స్థానికులు, బాధితులు కోరుతున్నారు.**

**ఎడిటర్ పెన్ పవర్ , ఏలూరు జూలై 15 :** భీమడోలు గ్రామంలోని ప్రభుత్వ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ఉద్యోగులు విధుల్లో ఉన్నప్పటికీ, వారికి కేటాయించిన బాధ్యతల్లో కొంత భాగాన్ని ప్రైవేట్ వ్యక్తులతో నిర్వహింపజేస్తున్నారనే ఆరోపణలు వెలువడుతున్నాయి. ఈ వ్యవహారం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్‌తో పాటు సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్లు, సబార్డినేట్ సిబ్బంది ప్రభుత్వ ఉద్యోగులుగా విధులు నిర్వహిస్తున్నప్పటికీ, రాణి, సంతోష్, లక్ష్మి అనే ప్రైవేట్ వ్యక్తులు కూడా కార్యాలయ పనుల్లో పాల్గొంటున్నారని ఫిర్యాదుదారులు ఆరోపిస్తున్నారు. రిజిస్ట్రేషన్ కోసం కార్యాలయానికి వచ్చే ప్రజలను అవసరానికి మించి వేచి ఉండేలా చేస్తున్నారని, త్వరగా పూర్తి చేయాల్సిన ప్రక్రియలను ఆలస్యం చేస్తున్నారని బాధితులు చెబుతున్నారు. కొందరితో అనుచితంగా మాట్లాడుతున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.

ముఖ్యంగా, వేలిముద్రలు, బయోమెట్రిక్ ధృవీకరణ, రికార్డుల నిర్వహణ వంటి సున్నితమైన ప్రభుత్వ ప్రక్రియల్లో ప్రైవేట్ వ్యక్తుల ప్రమేయం ఉందని ఫిర్యాదులు రావడం ఆందోళన కలిగిస్తోంది. ఈ అంశంపై ప్రభుత్వ నిబంధనలు పాటిస్తున్నారా లేదా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అలాగే, ప్రశ్నించిన వారితో "ఎవరికి ఫిర్యాదు చేయాలనుకుంటే వారికి చేయండి", "ఇక్కడ నేనే రూల్" అన్న తరహాలో స్పందిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణలు నిజమైతే అది ప్రభుత్వ సేవల పారదర్శకత, ప్రజా విశ్వాసంపై ప్రభావం చూపే అంశమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**ఎపిసోడ్ -3 లో అయ్యవారి బాగోతాలు చిట్టా... వరుస కథనాలు విత్ ప్రూఫ్ ల తో ... పెన్ పవర్ పాఠకులకోసం**

# అది రాష్ట్ర ద్రోహం, దేశ ద్రోహంతో సమానం

ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం సమీపంలో కృష్ణా–గోదావరి పవిత్ర సంగమం వేదికగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు గత ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును పూర్తిగా నిర్వీర్యం చేయడం రాష్ట్ర ద్రోహం, దేశ ద్రోహంతో సమానమని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. డాక్టర్ కేఎల్ రావు 124వ జయంతి వేళ, పట్టిసీమ నుంచి కృష్ణా డెల్టాకు నీటిని విడుదల చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన 'జలహారతి' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. గత ఐదేళ్ల పాలనలో సాగునీటి రంగంపై నిర్లక్ష్యం చూపారంటూ గణాంకాలతో సహా ఎండగట్టారు. ఒక వ్యక్తి ప్రాధాన్యతల కోసం రాష్ట్ర ప్రజల భవిష్యత్తును, రైతాంగ ప్రయోజనాలను ఫణంగా పెట్టారని తీవ్రంగా ఆరోపించారు.

**విమర్శలనే కాదు.. వారి మోసాన్ని మ్యూజియంలో పెడతా**

గత ప్రభుత్వ వైఫల్యాలను ఏకరువు పెట్టిన చంద్రబాబు, వారి పాలనలో జరిగిన మోసపూరిత చర్యలను తీవ్రంగా ఖండించారు. "వెలిగొండ ప్రాజెక్టు పనులు పూర్తికాకుండానే, సొరంగంలో యంత్రం ఇరుక్కుపోయిన విషయాన్ని దాచిపెట్టి, ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తున్నట్లు బోర్డు పెట్టి నాటకాలడారు. ప్రజలను ఇంత దారుణంగా మోసం చేస్తారా? వారి మోసానికి ప్రతీక అయిన ఆ ప్రారంభోత్సవ బోర్డును మ్యూజియంలో పెట్టి, ప్రజలకు శాశ్వతంగా గుర్తుండేలా చేస్తాను" అని సంచలన వ్యాఖ్యలు చేశారు. 2019–24 మధ్య కాలంలో ప్రాజెక్టుల గేట్లకు కనీసం గ్రీజు కూడా పూయని దుస్థితి ఉండేదని, పులిచింతల, గుండ్లకమ్మ గేట్లు కొట్టుకుపోయినా పట్టించుకోలేదని విమర్శించారు. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు చేసేందుకు ఎవరూ ముందుకు రాని దారుణమైన పరిస్థితిని సృష్టించారని మండిపడ్డారు.

తాము ఎంతో కష్టపడి పూర్తి చేసిన పట్టిసీమ ప్రాజెక్టును 'వట్టిసీమ', 'దండగ' అని ఆనాడు ప్రతిపక్షంలో ఉండి విమర్శించిన వారే, అధికారంలోకి వచ్చాక దాని విలువను గుర్తించలేకపోయారని అన్నారు. "నేను ఆ రోజు వారి విమర్శలకు భయపడి ఉంటే, ఈ పదేళ్లలో కృష్ణా డెల్టా పరిస్థితి ఏమై ఉండేదో ఒక్కసారి ఆలోచించండి. పట్టిసీమ ద్వారా గడిచిన పదేళ్లలో 450 టీఎంసీల గోదావరి జలాలను కృష్ణాకు తరలించి 13 లక్షల ఎకరాలను స్థిరీకరించాం" అని చంద్రబాబు స్పష్టం చేశారు.

**36 ప్రాజెక్టులు, 3 సంవత్సరాలు**

విమర్శలకే పరిమితం కాకుండా, రాష్ట్రాన్ని జల సమృద్ధంగా మార్చేందుకు తమ ప్రభుత్వ బృహత్ ప్రణాళికను చంద్రబాబు ఆవిష్కరించారు. రాబోయే మూడేళ్లలో రాష్ట్రంలోని 36 కీలక సాగునీటి ప్రాజెక్టులను రూ.35 వేల కోట్ల వ్యయంతో పూర్తి చేస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా పలు ప్రాజెక్టుల పూర్తికి స్పష్టమైన గడువులను నిర్దేశించారు. "రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును 2027 మార్చి నాటికి పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం. ఇప్పటికే 37 సార్లు భౌతికంగా, 37 సార్లు వర్చువల్‌గా సమీక్షలు నిర్వహించాను. పునరావాసంపై ప్రత్యేక దృష్టి సారించి నిర్వాసితులకు న్యాయం చేస్తాం" అని హామీ ఇచ్చారు. తాను 1996లో శంకుస్థాపన చేసిన వెలిగొండ ప్రాజెక్టు తొలిదశను ఈ ఏడాది సెప్టెంబర్ 1న ప్రారంభిస్తామని తెలిపారు. వీటితో పాటు వంశధార–నాగావళి–గోదావరి–కృష్ణా–పెన్నా నదుల అనుసంధానం తన చిరకాల స్వప్నమని, దానిని సాకారం చేసే దిశగా అడుగులు వేస్తామని పునరుద్ఘాటించారు. గుంటూరు ఛానల్ ఆధునికీకరణ, చింతలపూడి ఎత్తిపోతల, వరికపూడిశెల వంటి అనేక ప్రాజెక్టుల పూర్తికి నిర్దిష్ట తేదీలను ప్రకటించి, ప్రభుత్వం యొక్క చిత్తశుద్ధిని చాటుకున్నారు.

**మహనీయుల స్ఫూర్తితో ముందుకు**

ఈ సందర్భంగా డాక్టర్ కేఎల్ రావు, సర్ ఆర్థర్ కాటన్, శివరామకృష్ణయ్య, నందమూరి తారక రామారావు వంటి మహనీయులు సాగునీటి రంగానికి చేసిన సేవలను చంద్రబాబు స్మరించుకున్నారు. వారి దూరదృష్టి వల్లే ఈరోజు రాష్ట్రం అన్నపూర్ణగా నిలిచిందన్నారు. మంచి పనులు చేసిన వారిని ప్రజలు ఎప్పటికీ గుర్తుపెట్టుకుంటారని,

చెడును ఖండించాల్సిన బాధ్యత కూడా ప్రజలపై ఉందని హితవు పలికారు. తాము అధికారంలోకి వచ్చాక ధవళేశ్వరం, తుంగభద్ర బ్యారేజీల గేట్లను యుద్ధప్రాతిపదికన మార్పించామని, నిర్వహణ లోపాలను సరిదిద్దుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కేఎల్ రావు కుమారుడు విజయరావు కోరిన వైకుంఠపురం బ్యారేజీ నిర్మాణాన్ని కూడా తప్పకుండా చేపడతామని హామీ ఇచ్చారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో నీటిని పొదుపుగా వాడుకోవాలని, జల సంరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని సీఎం పిలుపునిచ్చారు.

# అమరావతి 2.0 మాస్టర్ ప్లాన్... సింగపూర్ ప్రతినిధులతో సీఎం చంద్రబాబు సమీక్ష

ఈ సమావేశంలో సింగపూర్ ప్రతినిధులు అమరావతి నిర్మాణానికి సంబంధించిన ప్రాజెక్టు పరిధి, అమలు ప్రణాళిక, దశలవారీ కార్యాచరణను ముఖ్యమంత్రికి వివరించారు. ఏరియా ప్లాన్, మౌలిక వసతుల కల్పన, పెట్టుబడి నమూనా వంటి కీలక అంశాలను ప్రాజెక్టులో భాగంగా చేర్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, ఉద్యోగాలు కల్పించడం ద్వారా అమరావతి ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు. అమరావతిని ఆర్థికంగా పరిపుష్టం చేసేలా 'క్రియేటివ్ సిటీ' నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్ల నిర్మాణంతో అమరావతిని అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దుతున్నామని సీఎం తెలిపారు. ఎల్‌నినోతో ఇబ్బందులు ఎదురైనా, పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను కృష్ణా నదికి తరలించడంతో రాజధాని ప్రాంతం జలకళను సంతరించుకుందని గుర్తుచేశారు. గ్లోబల్ బెంచ్‌మార్కింగ్ చేరుకోవడం, రాష్ట్ర ప్రజల తలసరి ఆదాయం గణనీయంగా పెంచడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు వివరించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ బిల్డింగ్ విధానాలను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ సమీక్షా సమావేశంలో మంత్రి పి.నారాయణ, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్ కుమార్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఒకరోజు 'మావిగన్', ఇంకోరోజు 'బెంతాహై'..

- మొదటి పేజి తరువాయి

సమీపంలోని చిన్నకొమెర్లలో దాల్మియా సిమెంట్ ప్లాంట్ విస్తరణ పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా జగన్, వైసీపీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.

**రాయలసీమ అభివృద్ధికి క్యాన్సర్ గడ్డ జగన్**

రాయలసీమ అభివృద్ధికి జగన్మోహన్ రెడ్డి ఒక క్యాన్సర్ గడ్డలా మారారని లోకేశ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బ్రాహ్మణి స్టీల్ ప్లాంట్ పేరుతో ప్రత్యక్షంగా 10 వేల ఉద్యోగాలు, పరోక్షంగా లక్ష మందికి ఉపాధి కల్పిస్తామని చెప్పి మోసం చేశారని ఆరోపించారు. "మైనింగ్ లైసెన్స్ తీసుకుని సుమారు 320 ఎకరాల్లో 'రెడ్ గోల్డ్' సంస్థ పేరుతో ఐరన్ ఓర్‌ను తరలించి విక్రయించుకున్నారు. దీనివల్ల గాలి జనార్ధన్ రెడ్డికి, జగన్‌కు ఆదాయం వచ్చింది తప్ప, కడప యువతకు ఒక్క ఉద్యోగం కూడా రాలేదు" అని విమర్శించారు. తాము తెచ్చిన కియా పరిశ్రమ వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా 30 వేల మంది జీవనం సాగిస్తున్నారని, ఇదే ప్రజాప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని అన్నారు.

**పరిశ్రమలను బెదిరించిన గొడ్డలి పార్టీ**

2019 నుంచి 2024 వరకు కియా యాజమాన్యాన్ని గొడ్డలి పార్టీ నేతలు బెదిరించారని లోకేశ్ ఆరోపించారు. దాల్మియా సిమెంట్‌కైతే ఏకంగా ఫ్యాక్టరీ మూసేయాలని నోటీసులు ఇచ్చారని, డబ్బులిస్తేనే ఫ్యాక్టరీ నడుస్తుందని, లేదంటే మూసేయాలనే ధోరణిలో వైసీపీ నేతలు ప్రవర్తించారని అన్నారు. "మేం అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో మూడుసార్లు కడప జిల్లాకు వచ్చాం. జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్ పనులు ప్రారంభించాం, ఇప్పుడు దాల్మియా విస్తరణకు శంకుస్థాపన చేశాం. ఒకే రాష్ట్రం, ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణే మా నినాదం. దేశంలోనే రికార్డు స్థాయిలో రాష్ట్రానికి పరిశ్రమలు తెస్తున్నాం" అని తెలిపారు.

**వైసీపీ ఒక 'హిట్ అండ్ రన్' పార్టీ**

జగన్ రెడ్డి పార్టీకి 'హిట్ అండ్ రన్ పార్టీ' అని పేరు పెట్టవచ్చని లోకేశ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. "జగన్ కాన్వాయ్ వాహనం ఢీకొని ఆ పార్టీ కార్యకర్త సింగయ్య చనిపోతే, శవాన్ని రోడ్డుపై వదిలేసి వెళ్లిపోయారు. నిజాయతీ ఉంటే కోర్టుకు వెళ్లి స్టే ఎందుకు తెచ్చుకున్నారు? సొంత బాబాయ్‌నే హత్య చేస్తే తప్పు కాదు, కార్యకర్త చనిపోతే తప్పు కాదు" అని తీవ్రంగా విమర్శించారు. తమ హయాంలో మత్స్యకారులు చనిపోతే ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షలు ఇచ్చామని, కానీ జగన్ పాలనలో 250 మంది మత్స్యకారులు చనిపోతే వారి కుటుంబాలకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

**ఉద్యోగాల కల్పనలో విఫలం**

ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఒక్క జాబ్ క్యాలెండర్ కూడా ఇవ్వలేదని, కానీ తాము అధికారంలోకి వచ్చిన 150 రోజుల్లోనే 16,000 డీఎస్సీ పోస్టులు భర్తీ చేశామని లోకేశ్ గుర్తుచేశారు. కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్ పూర్తి చేసి, త్వరలో కొత్త జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని హామీ ఇచ్చారు.

పెట్రోల్,

డీజిల్ ధరలపై జగన్ చేస్తున్న విమర్శలను తిప్పికొడుతూ, "జగన్ హయాంలో క్రూడ్ ఆయిల్ ధరలు పెరగకపోయినా పెట్రోల్, డీజిల్ ధరలు రూ.35 పెంచారు. అప్పుడు నోరు మెదపని జగన్ ఇప్పుడు విమర్శించడం విడ్డూరంగా ఉంది. అధికారం పోతే ఒక నీతా?" అని ప్రశ్నించారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతామని, గండికోట జలాలను సమర్థంగా వినియోగించుకుంటామని లోకేశ్ స్పష్టం చేశారు.

# పోక్సో కేసులో జగిత్యాల కోర్టు సంచలన తీర్పు... ఐదుగురికి జీవిత ఖైదు..

జగిత్యాల జిల్లాలో సంచలనం రేపిన మైనర్ బాలిక గ్యాంగ్ రేప్ కేసులో సంచలన తీర్పునిచ్చింది కోర్టు. 2020లో మెట్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఘటనపై బుధవారం ( జులై 15 ) తీర్పు వెల్లడించింది కోర్టు.ఈ కేసుకు సంబంధించి ఐదుగురు నిందితులను దోషులుగా తేల్చిన ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక పోక్సో కోర్టు.. వారికి జీవిత ఖైదు విధించింది. అంతే కాకుండా.. ఒక్కో దోషికి రూ.20 వేల జరిమానా విధించిన కోర్టు.. బాధిత మైనర్ బాలికకు రూ.12 లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశించింది. పటిష్ట ఆధారాలతో పోలీసులు, ప్రాసిక్యూషన్ కేసు నిరూపించడంతో ప్రిన్సిపల్ జిల్లా సెషన్స్ జడ్జి రత్న పద్మావతి కీలక తీర్పు వెల్లడించారు.ఇటీవల షాబాద్ లో పోక్సో కేసు నిందితుడు బెయిల్ పై వచ్చి మారణకాండ సృష్టించి చివరికి తానూ ఆత్మహత్య చేసుకున్న ఘటన కలకలం రేపిన క్రమంలో జగిత్యాల పోక్సో కేసు తీర్పు ప్రాధాన్యత సంతరించుకుంది. పోక్సో కేసు నిందితులకు బెయిల్ మంజూరు చేయకుండా... వీలైనంత త్వరగా కేసు నిరూపించి శిక్ష విధించాలని కోరుతున్నారు జనం.

## చంద్రబాబు సానుభూతిపరులు

# సిండికేట్‌గా ఏర్పడి రైతులను దోచుకుంటున్నారు

- మొదటి పేజి తరువాయి

మీద వాన పడినట్టు ప్రభుత్వం తీరు ఉందని విమర్శించారు. ఆక్వా రంగం ఐదు లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తుందని జగన్ తెలిపారు. చంద్రబాబు సానుభూతిపరులే సిండికేట్‌గా ఏర్పడి రైతులను దోచుకుంటున్నారని ఆరోపించారు. ఫీడ్, సీడ్ రేట్లు చంద్రబాబు మనుషులే ఫైనల్ చేస్తారని, చంద్రబాబు సిండికేట్ రాష్ట్రాన్ని నడిపిస్తోందని ఎద్దేవా చేశారు. ఫీడ్ రేట్లు కేజీకి రూ.14 నుంచి 16కి ఎడాపెడా పెంచేశారని, ముష్టి వేసినట్టు కేజీకి రూ.2 తగ్గిస్తే సరిపోతుందా అని ప్రశ్నించారు. రేట్లు పెంచితే పెంచేస్తారని... రేట్లు తగ్గితే తగ్గించరా అని మండిపడ్డారు. వైసీపీ హయాంలో ఆక్వా రైతుల కోసం 'అప్సడా' ఏర్పాటు చేశామని... సీడ్, ఫీడ్, మార్కెటింగ్‌లో సమస్యలు వస్తే పరిష్కరించామని గుర్తు చేశారు. చంద్రబాబు వచ్చాక 'అప్సడా'ను నిర్వీర్యం చేశారని విమర్శించారు. రొయ్యలకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకున్నామని, రొయ్యలకు మద్దతు ధర తగ్గకుండా మానిటర్ చేశామని తెలిపారు. రైతుకు గిట్టుబాటు ధర తగ్గకూడదని చట్టం చేశామన్నారు.

ఈరోజు కేజీ కౌంట్ రూ.230లు దాటని పరిస్థితి ఉందని చెప్పారు. ఆక్వా రైతులకు తాము 1.50కే యూనిట్ విద్యుత్ అందించామని, ఐదేళ్లలో సబ్సిడీ కింద రూ.3,306 కోట్లు చెల్లించామని గుర్తు చేశారు. చంద్రబాబు ఎగ్గొట్టిన రూ.401 కోట్ల సబ్సిడీ బకాయిలు చెల్లించామన్నారు. చంద్రబాబు ప్రతి అడుగు మోసమని విమర్శించారు. ఆక్వా రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చారా? అని ప్రశ్నించారు.

పెన్ పవర్
పోలవరం - ఏలూరు
తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి

## స్వర్ణ పంచాయతీ కార్యాలయాల్లో ఆధార్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



**పెన్ పవర్, ఉంగుటూరు । జులై 15:**స్వర్ణ పంచాయతీ కార్యాలయాల్లో అందుబాటులో ఉన్న ఆధార్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఏలూరు జిల్లా స్వర్ణ గ్రామ--స్వర్ణ వార్డు అధికారి జి. వెంకట నాయుడు సూచించారు.

బుధవారం ఆయన ఉంగుటూరు మండలంలోని నారాయణపురం-2, వెల్లమిల్లి-2 స్వర్ణ గ్రామ కార్యాలయాలను తనిఖీ చేసి ఆధార్ సేవల నిర్వహణ, సంబంధిత రికార్డులను పరిశీలించారు. క్షేత్రస్థాయిలో, సాంకేతికంగా ఎదురవుతున్న సమస్యలపై ఆపరేటర్లను అడిగి తెలుసుకుని, సేవలను మరింత సమర్థవంతంగా అందించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో స్వర్ణ గ్రామ పంచాయతీ మండల డిప్యూటీ ఎంపీడీవో ముత్తయ్య పాల్గొన్నారు.

## మూలనపడ్డ ఆర్వో ప్లాంట్లు...
## తాగునీటికి విద్యార్థుల అవస్థలు



**పెన్ పవర్, ఉంగుటూరు । జులై 15**

ఉంగుటూరు మండలంలోని 12 జడ్పీ ఉన్నత పాఠశాలల్లో సర్వ శిక్ష అభియాన్ ద్వారా ఏర్పాటు చేసిన ఆర్వో (ఆ) ప్లాంట్లు చాలాచోట్ల పనిచేయకుండా మూలనపడ్డాయి. ఉంగుటూరు, నారాయణపురం, కైకరం తదితర జడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లు నిలిచిపోవడంతో విద్యార్థులకు సురక్షిత తాగునీరు అందని పరిస్థితి నెలకొంది.

దీంతో విద్యార్థులు ఇళ్ల నుంచి తాగునీటి సీసాలు తీసుకురావాల్సి వస్తోంది. కొన్ని పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, దాతల సహకారంతో బయట ఉన్న ఆర్వో ప్లాంట్ల నుంచి నీటిని తెప్పించి పొదుపుగా వినియోగిస్తున్నారు.

కైకరం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆర్వో ప్లాంట్ పనిచేయకపోవడంతో కొంతకాలం దాతల సహకారంతో నీటిని డబ్బాల్లో తీసుకువచ్చారు. అయితే దాతల సహాయం లేని రోజుల్లో ప్రతి విద్యార్థి రూ.10 చొప్పున విరాళంగా ఇచ్చి, తరగతి వారీగా డబ్బు పోగు చేసి రోజుకు 20 లీటర్ల తాగునీటి క్యాన్ కొనుగోలు చేస్తున్నారు.

ఉంగుటూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు నెలకు సుమారు రూ.3,000 వరకు సొంత నిధులు వెచ్చించి తాగునీటిని కొనుగోలు చేసి విద్యార్థులకు అందిస్తున్నారు. మండలంలోని మరికొన్ని ప్రభుత్వ పాఠశాలల్లోనూ ఇలాంటి



పరిస్థితులే కొనసాగుతున్నాయి.

సురక్షిత తాగునీరు అందకపోవడం వల్ల విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభావం పడుతుందనే ఆందోళనను తల్లిదండ్రులు వ్యక్తం చేస్తున్నారు. మరమ్మతులకు గురైన ఆర్వో ప్లాంట్లను వెంటనే బాగుచేసి తిరిగి వినియోగంలోకి తీసుకురావడంలో అధికార యంత్రాంగం విఫలమైందని వారు విమర్శిస్తున్నారు.

ఈ విషయాన్ని ఇప్పటికే సర్వ శిక్ష అభియాన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, ఆర్వో ప్లాంట్ల మరమ్మతుల కోసం సమాచారం అందించామని సంబంధిత అధికారులు తెలిపారు.

## గిరిజన ఉత్పత్తులకు జాతీయ మార్కెట్ కల్పిస్తాం





- కళాకారులు నమోదు చేసుకుని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్ జూలై 15 :**పోలవరం జిల్లాలోని గిరిజన కళాకారుల ఉత్పత్తులను జాతీయ స్థాయిలో గుర్తింపు పొందేలా చర్యలు చేపట్టి, వారికి మెరుగైన మార్కెట్ అవకాశాలు కల్పించడం ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో కేంద్ర ప్రభుత్వ ట్రైఫెడ్, ఐటీడీఏ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన గిరిజన ఉత్పత్తుల సాధికారత నమోదు మేళాను జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్, జిల్లా జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్, ట్రైఫెడ్ ప్రాంతీయ మేనేజర్ భాస్కర్ జా, ఉప మేనేజర్ చలవాడి శివ బసవన్న జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతంలో వెదురు, తేనె, సేంద్రియ జీడిపప్పు, అడవి ఆహార ఉత్పత్తులు, సంప్రదాయ హస్తకళలకు దేశవ్యాప్తంగా మంచి డిమాండ్ ఉందన్నారు. ఈ ఉత్పత్తులను స్థానిక సంతలకే పరిమితం చేయకుండా జాతీయ మార్కెట్లకు చేరవేస్తే గిరిజన కళాకారులకు మెరుగైన ఆదాయం లభిస్తుందని పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో పండే జాఫ్రా వంటి ఉత్పత్తులకు విదేశాల్లో కూడా మంచి గిరాకీ ఉందని, ఇటువంటి ఉత్పత్తులకు విలువ ఆధారిత మార్కెట్ కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ట్రైఫెడ్ ద్వారా కళాకారులను ప్రభుత్వ వ్యయంతో ఢిల్లీ వంటి జాతీయ ప్రదర్శనలకు తీసుకెళ్లి వారి ఉత్పత్తులను ప్రదర్శించే అవకాశం కల్పిస్తామని, అందుకోసం గిరిజన కళాకారులు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. గిరిజన కళలు, సంప్రదాయ వృత్తులను పరిరక్షిస్తూ అడవి ఆధారిత ఉత్పత్తులకు జాతీయ స్థాయి మార్కెటింగ్ సదుపాయం కల్పించడం ద్వారా గిరిజన కుటుంబాల ఆర్థిక సాధికారతను పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ, ట్రైబస్ ఇండియా విక్రయ కేంద్రాలు, ట్రైఫెడ్ మార్కెటింగ్ వ్యవస్థ ద్వారా గిరిజన కళాకారుల ఉత్పత్తులను దేశవ్యాప్తంగా విక్రయించే అవకాశాలు కల్పించేందుకే ఈ నమోదు మేళా నిర్వహిస్తున్నామని తెలిపారు. దీని ద్వారా కళాకారులకు విస్తృత మార్కెట్, మెరుగైన ఆదాయం, స్థిరమైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. ట్రైఫెడ్ ప్రాంతీయ మేనేజర్ భాస్కర్ జా మాట్లాడుతూ, నమోదు ప్రక్రియ, అర్హత ప్రమాణాలు, ఉత్పత్తుల సేకరణ విధానం, మార్కెటింగ్ అవకాశాలు, ట్రైఫెడ్ అందించే సహాయక కార్యక్రమాలపై కళాకారులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఎంపికైన నమూనా ఉత్పత్తుల కొనుగోలు ప్రక్రియను ప్రారంభించి, వాటికి జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడానికి చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. అనంతరం ముఖ్య అతిథులు గిరిజన కళాకారులు ఏర్పాటు చేసిన ఉత్పత్తుల ప్రదర్శన స్టాల్స్‌ను సందర్శించి, తయారీ విధానం, ప్రత్యేకతలు, మార్కెట్ అవకాశాలపై వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమం ముగింపులో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్లను శాలువాలతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ జనరల్ డి.ఎన్.వి. రమణ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ దాసరి రత్నాకర్ రావు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి దేవదానం, జిల్లా వైద్యాధికారి నరేంద్ర కుమార్, కార్యనిర్వాహక ఇంజనీర్ ఐ. శ్రీనివాసరావు, మండల అభివృద్ధి అధికారి ప్రసాద్, యాంకర్ పర్సన్ రామరాజు, ఐటీడీఏ వ్యవసాయ అధికారి ఎర్రంశెట్టి రాజు, ట్రైఫెడ్ అధికారులు, వివిధ శాఖల అధికారులు, గిరిజన కళాకారులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యం... టీడీపీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలి



దేవీపట్నంలో తెలుగుదేశం పార్టీ విస్తృత స్థాయి సమావేశం

**గంగవరం /దేవీపట్నం, పెన్ పవర్ జూలై 15 :**

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఘన విజయం సాధించేలా పార్టీ శ్రేణులంతా క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని దేవీపట్నం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గోళ్ళ చంటిబాబు పిలుపునిచ్చారు.

బుధవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి సూచనల మేరకు దేవీపట్నం మండల తెలుగుదేశం పార్టీ విస్తృత స్థాయి సమావేశం ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షుడు గోళ్ళ చంటిబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బూత్ స్థాయి నుంచి మండల స్థాయి వరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోళ్ళ చంటిబాబు మాట్లాడుతూ, పార్టీని గ్రామ స్థాయిలో మరింత బలోపేతం చేయడానికి ప్రతి యూనిట్ పరిధిలో క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రతి నాయకుడు, కార్యకర్త ప్రజల్లోకి వెళ్లి పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా తీసుకెళ్లాలని, అందరూ ఐక్యంగా పనిచేసి విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సొసైటీ అధ్యక్షుడు మాగాపు బాబురావు, క్లస్టర్ ఇన్‌చార్జి ముచ్చు వీరవెంకట సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కీర్తి గంగరాజు, మాజీ మండల అధ్యక్షులు తైలం గంగాధర్, మరిశెట్ల వెంకటేశ్వరరావు, పోశమ్మగండి చైర్మన్ మలుగుల శ్రీనివాస్ రెడ్డి, నియోజకవర్గ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు రేలంగి రాంబాబు, బీసీ సెల్ నాయకుడు బూరుగు చిన్ని, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు అడబాల వీరభద్రరావు, మార్కెట్ యార్డు డైరెక్టర్ జొన్నల రాంబాబు, ఐటీడీపీ కార్యదర్శి కుటుంబరెడ్డి, మాజీ రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి చవళం శివరామకృష్ణ, అరకు పార్లమెంట్ నాయకుడు కొత్తపల్లి ఆనంద్, మండల ప్రచార కార్యదర్శి పేరుగాని ఏసు, పోశమ్మగుడి డైరెక్టర్ నాని, పాఠశాల కమిటీ చైర్మన్ సామిరెడ్డి రామకృష్ణ, సర్వారం బూత్ కో-కన్వీనర్ నాగు, కొంజం తాతాజీ, ఇందుకూరుపేట గ్రామ కమిటీ అధ్యక్షుడు పోతుల వాసు, సురేష్‌తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## జిల్లా డీఎంహెచ్‌వోగా డా. పి. కోమల



**రాజమహేంద్రవరం, పెన్ పవర్,జూలై 15:** తూర్పు గోదావరి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారిణి గా డా. పి. కోమల బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు.

అనంతరం జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ చేకూరి కీర్తి ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నూతన డీఎంహెచ్‌వోకు అభినందనలు తెలియజేసి, జిల్లాలో ప్రజారోగ్య సేవలను మెరుగుపరిచే దిశగా పనిచేయాలని సూచిస్తూ పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. ప్రజలకు నాణ్యమైన, సకాలంలో వైద్య సేవలు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని ఆమె స్పష్టం చేశారు.

బాధ్యతలు స్వీకరించిన అనంతరం డీ ఎమ్ హెచ్ వో డా. పి. కోమల డీ ఎమ్ హెచ్ వో కార్యాలయ సిబ్బందితో మాట్లాడుతూ, మాతృ మరణాలు, శిశు మరణాల తగ్గింపునకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్యను పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని జాతీయ, రాష్ట్ర ఆరోగ్య కార్యక్రమా లను నూటికి నూరు శాతం లక్ష్య సాధన దిశగా సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. వివిధ శాఖలతో సమన్వయం, సిబ్బంది సహకారంతో ప్రభుత్వ నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయడంతో పాటు ఆరోగ్య శాఖకు సంబంధించిన అన్ని ఆన్‌లైన్ యాప్‌లు, పోర్టల్‌లలో సమాచారాన్ని సకాలంలో నవీకరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో ప్రస్తుతం పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న డా. వసుంధర నుంచి ఆమె బాధ్యతలను స్వీకరించారు. నూతన డీఎంహెచ్‌వోను యూనియన్ నాయకులు, జిల్లా ప్రోగ్రాం అధికారులు, వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, కార్యాలయ సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## విద్యార్థుల భవిష్యత్తుకు మార్గదర్శకులు ఉపాధ్యాయులే-జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి





**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూలై 15:**విద్యార్థుల సమగ్రాభివృద్ధి, నాణ్యమైన విద్య అందించడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి అన్నారు.

స్థానిక ఎస్ కే వి టి డిగ్రీ కళాశాల సమావేశ మందిరంలో బుధవారం తూర్పు గోదావరి జిల్లా ప్రధానోపాధ్యాయులు , మండల విద్యాశాఖాధికారులు, ఉప విద్యాశాఖాధికారులతో విద్యా ప్రమాణాల మెరుగుదలపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భం గా జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ, విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి విద్యార్థిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం, చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. క్రమశిక్షణ, విలువలు, వ్యక్తిత్వ వికాసం కల్పించడంలో ఉపాధ్యాయులు మార్గదర్శకులుగా నిలవాలన్నారు. తల్లిదండ్రులకు విద్యార్థులను సక్రమంగా మార్గనిర్దేశం చేసే అవకాశం లేకపోవడంతో, ఉపాధ్యాయులే వారికి అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు.

కేవలం పదో తరగతి ఉత్తీర్ణత శాతమే విద్యా ప్రమాణాలకు కొలమానం కాదని, విద్యార్థులు పాఠ్యాంశాలను ఎంత మేరకు అవగాహన చేసుకున్నారనేదే అసలు ప్రమాణమని కలెక్టర్ స్పష్టం చేశారు. ముఖ్యంగా ఆరవ తరగతి విద్యార్థుల్లో ప్రాథమిక విద్యా నైపుణ్యాలు బలోపేతంపై దృష్టి సారించాలన్నారు. 8, 9, 10వ తరగతుల విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పెంపునకు పాఠశాల స్థాయిలో చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు.

ప్రధానోపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు, అమలు చేస్తున్న ఉత్తమ విధానాలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సమావేశంలో జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె. వాసుదేవరావు, సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్. సుభాషిణి, జిల్లా వ్యాప్తంగా సుమారు 200 మంది ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖాధి కారులు, ఉప విద్యా శాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా లోపాల సవరణపై గంగవరంలో ముమ్మర కసరత్తు

**ఓటరు వివరాల పరిశీలన వేగవంతం చేయాలని క్షేత్రస్థాయి అధికారులకు తహసీల్దార్ ఆదేశం**



**గంగవరం, పెన్ పవర్ జూలై 15:** ఓటరు జాబితాను పూర్తిస్థాయిలో లోపరహితంగా, పారదర్శకంగా రూపొందించేందుకు గంగవరం మండలంలో అధికారులు ముమ్మర చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో బుధవారం మండలంలోని 37 మంది బూత్ స్థాయి అధికారులు, పర్యవేక్షకులతో తహసీల్దార్ సి. హెచ్. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఓటరు జాబితాలో గుర్తించిన లోపాలు, ఏ పోలింగ్ కేంద్రానికి అనుసంధానం కాని ఓటర్ల వివరాలు, ఒకే వ్యక్తికి సంబంధించిన అనుమానాస్పద ద్వంద్వ నమోదులపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. వాటిని త్వరితగతిన సరిదిద్దేందుకు అవసరమైన సూచనలు అధికారులకు అందించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు ప్రతి ఓటరు వివరాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు జాబితాలో ఉండేలా, తప్పులు, లోపాలు లేకుండా సవరణలు పూర్తి చేయాలని తహసీల్దార్ ఆదేశించారు. నిర్ణీత గడువులోగా అన్ని వివరాలను ఖచ్చితంగా నమోదు చేసి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణరావు మాట్లాడుతూ, ప్రతి నమోదును నిశితంగా పరిశీలించి, గుర్తించిన లోపాలను వెంటనే సవరించాలని, క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేసి ఓటరు జాబితాను మరింత నాణ్యంగా రూపొందించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణరావు, పర్యవేక్షకులు, బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# దశాబ్దంగా దుస్థితిలో కుసుమరాయి-- కొమరవరం రహదారి

**రోడ్డు మంజూరు చేసి వెంటనే నిర్మాణం చేపట్టాలని గ్రామస్తుల ఆందోళన**



**గంగవరం, పెన్ పవర్, జూలై 15:** పోలవరం జిల్లా గంగవరం మండలంలోని కుసుమరాయి--కొమరవరం గ్రామాల మధ్య ఉన్న ప్రధాన రహదారిని తక్షణమే మంజూరు చేసి నిర్మాణం చేపట్టాలని కుసుమరాయి గ్రామానికి చెందిన సుమారు వంద మంది గ్రామస్తులు బుధవారం రోడ్డుపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. గ్రామానికి అత్యంత కీలకమైన ఈ రహదారి దాదాపు పదేళ్లుగా అధ్వాన్న స్థితిలో ఉండటంతో నిత్యం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామస్తుల కథనం ప్రకారం, వర్షాకాలం ప్రారంభమైన ప్రతిసారి రహదారి పూర్తిగా బురదమయంగా మారి రాకపోకలకు అనుకూలంగా ఉండడం లేదన్నారు. అత్యవసర పరిస్థితుల్లో గర్భిణులు, వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారిని ఆసుపత్రులకు తరలించేందుకు అంబులెన్స్ సైతం గ్రామంలోకి చేరలేని పరిస్థితి నెలకొంటోందని తెలిపారు. ఇతర వాహనాలు కూడా ఈ రహదారిపై ప్రయాణించలేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. గంగవరం మండల కేంద్రానికి అత్యంత సమీపంలో ఉన్న ఈ గ్రామాలకు సరైన రహదారి లేకపోవడం విచారకరమని గ్రామస్తులు పేర్కొన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రహదారి నిర్మాణానికి వెంటనే నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా రంపచోడవరం ఎమ్మెల్యే మిర్యాల శిరీష దేవి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, పోలవరం జిల్లా కలెక్టర్ స్పందించి రహదారి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాయం వెంకటేశ్వర్లు, సారపు తమన్న దొర, సారపు కామరాజు, చవలం శ్రీనివాస్, కారం విజయలక్ష్మి, తాము ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# అడ్డతీగల ఎంపీడీఓ కార్యాలయంలో సమీక్షా సమావేశం: పలు అభివృద్ధి పనులపై సిబ్బందికి దిశానిర్దేశం...



**అడ్డతీగల, పెన్ పవర్, జూలై 15;** అడ్డతీగల ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం వారంతపు సమీక్షా సమావేశంలో క్షేత్రస్థాయి అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ సమావేశానికి ఎంపీడీవో ఏబీవీ కుమార్, ఏపీఓ బి. చిరంజీవి రావుతో పాటు టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు మరియు ఫీల్డ్ అసిస్టెంట్లు హాజరయ్యారు. సమావేశంలో ఎంపీడీఓ పలు కీలక అంశాలపై సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా జలసంచాయి – జలభగీరథి పోర్టల్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీడీవో సిబ్బంది ఆదేశించారు. 2025 ఏప్రిల్ నెలకు ముందు పూర్తి చేసిన పనులకు సంబంధించిన ఫొటోలను వెంటనే సంబంధిత పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేశారు. అలాగే ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు అవసరమైన అంచనాలను వేగంగా సిద్ధం చేయాలని సూచించారు.

దీనితో పాటు వెలుగు పథకం కింద గుర్తించిన రైతుల జాబితాను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, వారి భూముల ప్రస్తుత పరిస్థితిని అంచనా వేసి నివేదికలు రూపొందించాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన రైతులందరికీ అందేలా చూడాలని, పెండింగ్‌లో ఉన్న పనులను సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీఓ సిబ్బందికి సూచించారు.

# పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పునరావాసం కల్పించాలి



- ప్రాజెక్టు ఎత్తు తగ్గించకుండా కేంద్రంపై ఒత్తిడి తేవాలి
- మీడియా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు

**రాజమహేంద్రవరం పెన్ పవర్ జూలై 15:** రాష్ట్ర విభజనలో భాగంగా పోలవరం ప్రాజెక్టు జాతీయ ప్రాజెక్టుగా కేంద్రం గుర్తించిందని , నిధులతో నిర్మాణం చేపడుతుందని ప్రాజెక్టు నిర్వాసితులకు నష్టపరిహారం ,పునరావాసం కల్పించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్ క్లబ్లో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల అధ్యయన కమిటీ చైర్మన్ మాట్లాడుతూ, ప్రాజెక్టు వల్ల ఒక లక్ష ఆరువేల మంది భూములు, ఇండ్లు, ఆస్తులు కోల్పోయి గిరిజనులు, ఇతరులు నిర్వాసితులయ్యారని వారికి నష్ట పరిహార కింద చెల్లించాల్సిన రూ .32 వేల కోట్ల రూపాయలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చెల్లించకపోవడం దారుణం అన్నారు. 45.7 మీ ఉండాల్సిన ప్రాజెక్టు ఎత్తును కేంద్రం ఒత్తిడి మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 41.35 మీటర్లకు తగ్గించేందుకు అంగీకరించడం సరికాదు అన్నారు. తగ్గించడం వల్ల ఎగువ ప్రాంతాలకు నీరు నీరు సాగునీరు పారించలేరని, లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు గా మిగిలిపోతుందనిఅన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల ఉపయోగం లేదని వేల కోట్ల ప్రజాధనం వృధాని అన్నారు. ప్రజలను మభ్య పెట్టడానికేనని పోలవరం ప్రాజెక్టు పనులు చేస్తున్నారని, నిర్వాసితులకు పునరావసరంపూర్తి కాలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాలు ఆకుల భాగ్యశ్రీ మాట్లాడుతూ, పోలవరం ప్రాజెక్టు పనులు పేరుతో కోట్ల రూపాయలు అవినీతి జరుగుతుందని, పనులకు జమా లెక్కలకు భారీ వ్యత్యాసం ఉందని కాగ్ నివేదికలో తెలిపిందన్నారు. అవినీతి అక్రమాలపై చంద్రబాబు నాయుడు ప్రజలకు స్పష్టత ఇవ్వాలన్నారు. రాజమండ్రి పార్టీ అధ్యక్షుడు టి కే విశ్వేశ్వర రెడ్డి మాట్లాడుతూ, ప్రాజెక్టు డి పి ఆర్ ప్రకారం 45.7 మీటర్లు ఉండగా 41.35 మీటర్లకు కేంద్రం తగ్గించడాన్నీ చంద్రబాబు నాయుడు ఉదసీనంగా ఉండడం ప్రాజెక్టు ఉద్దేశం నెరవేరదన్నారు. ప్రాజెక్టు ఎత్తు తగ్గించడంలో వ్యతిరేకించడంలో రాష్ట్ర ఎంపీలు విఫలమయ్యారని విమర్శించారు. పోలవరం ప్రాజెక్టులో పునరావాసాన్ని వెంటనే అమలు చేయాలని నిర్వాసితులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్ మాట్లాడుతూ ఇంకా 20, 30 శాతం పనులు మిగిలి ఉండగానే వచ్చే ఏడాది మార్చిలో ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తానని చంద్రబాబు నాయుడు ప్రకటన చేయడం ప్రజలను మోసం చేయడమేనని విమర్శించారు. ఈ సమావేశంలో వీరభద్రం మోత శారద తదితరులు పాల్గొన్నారు.

# చింతూరు మండల టీడీపీ మండల స్థాయి సమావేశం విజయవంతం





**చింతూరు, పెన్ పవర్ జూలై 15:** తెలుగుదేశం పార్టీ మండల స్థాయి సమావేశం మండల పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షులు ఎం.డి. జమాల్ ఖాన్ అధ్యక్షతన ఘనంగా జరిగింది. ఈ సమావేశంలో మండలంలోని వివిధ కమిటీల అధ్యక్షులు, జనరల్ సెక్రటరీలు, ఉపాధ్యక్షులు, క్లస్టర్, కో క్లస్టర్ ఇంచార్జులు, యూనిట్ ఇంచార్జులు, బీఎల్ఏలు, కేఎస్ఎస్ సభ్యులు, మహిళా కార్యకర్తలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఇటీవల మండలంలోని అన్ని యూనిట్లలో నిర్వహించిన సమావేశాల సందర్భంగా గ్రామాల వారీగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, అభివృద్ధి అవసరాలు, ప్రభుత్వ పథకాల అమలులో ఉన్న ఇబ్బందులు, తాగునీరు, రహదారులు, విద్యుత్, సాగునీరు, గృహాలు, సంక్షేమ పథకాల అమలుకు సంబంధించిన అంశాలపై యూనిట్ ఇంచార్జులు సిద్ధం చేసిన వినతిపత్రాలను మండల అధ్యక్షులు ఎం.డి. జమాల్ ఖాన్‌కు సమర్పించారు. సమావేశంలో ప్రతి గ్రామం నుంచి అందిన వినతిపత్రాలను సవివరంగా పరిశీలించి, సమస్యలను ప్రాధాన్యత క్రమంలో సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని నిర్ణయించారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా పార్టీ నాయకులు గ్రామస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని, ప్రతి కార్యకర్త సభ్యత్వ కార్డును వినియోగంలో ఉంచాలని, బూత్, యూనిట్, క్లస్టర్ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని జమాల్ ఖాన్ పిలుపునిచ్చారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని కోరారు. సమావేశాన్ని విజయవంతం చేసిన పార్టీ నాయకులు, వివిధ కమిటీల సభ్యులు, యూనిట్ ఇంచార్జులు, మహిళా కార్యకర్తలు, కార్యకర్తలందరికీ మండల అధ్యక్షులు ఎం.డి. జమాల్ ఖాన్ కృతజ్ఞతలు తెలిపారు.

# "సేవ్ వాటర్ -- వర్షపు నీటిని వృథా చేయొద్దు"





**తాడేపల్లిగూడెం పురపాలక సంఘం కమిషనర్**

**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. జూలై 15:** తాడేపల్లిగూడెం పురపాలక సంఘం కమిషనర్ యేసుబాబు ఆధ్వర్యంలో "సేవ్ వాటర్ -- వర్షపు నీటిని వృథా చేయొద్దు" అనే సందేశంతో ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా కమిషనర్ యేసుబాబు మాట్లాడుతూ... వర్షపు నీరు ప్రకృతి ప్రసాదించిన అమూల్యమైన సంపద అని, ప్రతి ఒక్కరూ వర్షపు నీటిని వృథా కాకుండా ఇంకుడు గుంతలు, రైన్ వాటర్ హార్వెస్టింగ్ పద్ధతుల ద్వారా భూగర్భ జలాల్లోకి చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రతి ఇంటిలో వర్షపు నీటి సంరక్షణ చర్యలు చేపట్టడం వల్ల భవిష్యత్ తరాలకు తాగునీటి కొరతను నివారించవచ్చని తెలిపారు. నీటిని పొదుపుగా వినియోగించడం ప్రతి పౌరుడి బాధ్యత అని, "ప్రతి నీటి బొట్టు ఎంతో విలువైనది" అనే భావనతో ముందుకు సాగాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

పర్యావరణ పరిరక్షణతో పాటు నీటి సంరక్షణలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరుతూ, "సేవ్ వాటర్..సేవ్ ఫ్యూచర్"అనే నినాదంతో కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# అడ్డతీగలలో ఏ.పీ.ఆర్ కళాశాల విద్యార్థులకు పోలీసుల అవగాహన కార్యక్రమం..





**అడ్డతీగల, పెన్ పవర్, జూలై 15;** అడ్డతీగల ఏపీఆర్ కళాశాలలో సిఐ ఎం గజేంద్ర కుమార్ మరియు ఎస్సై బి. వినోద్ ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నేటి డిజిటల్ యుగంలో రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, సోషల్ మీడియాలో వ్యక్తిగత సమాచారాన్ని, బ్యాంకింగ్ వివరాలను తెలియని వ్యక్తులతో పంచుకోవద్దని సీఐ గజేంద్ర కుమార్ విద్యార్థులకు తెలియజేశారు. ఒకవేళ సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని అవగాహన కల్పించారు.

అంతేకాకుండా, ఎన్డీపీఎస్ చట్టం గురించి వివరిస్తూ, మాదకద్రవ్యాల మహమ్మారి యువతను ఏ విధంగా పెడదోవ పట్టిస్తుందో, వాటికి బానిసలవ్వడం వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ, లక్ష్యసాధన దిశగా కృషి చేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఎస్సై బి. వినోద్ మాట్లాడుతూ రోడ్డు భద్రతా నిబంధనలపై విద్యార్థులకు కీలక సూచనలు చేశారు. ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, అతివేగం పనికిరాదని, మరియు మద్యం సేవించి వాహనం నడపటం ప్రాణాలకు ప్రమాదకరమని వివరించారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండి, బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, కళాశాల అధ్యాపకులు మరియు సిబ్బంది, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## గ్రీవెన్స్ ఫిర్యాదుతో గిరిజన భూమి అసలు యజమానికి అప్పగింత



**చింతూరు, పెన్ పవర్, జూలై 15:** చింతూరు ఐటిడిఏలో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో అందిన ఫిర్యాదు ఆధారంగా, గ్రామ పెసా కమిటీ సహకారంతో చట్టి గ్రామపంచాయతీ పరిధిలోని పెట్రోల్ బంక్ ఆధీనంలో ఉన్న సవలం సుబ్బారావుకు చెందిన భూమిని బుధవారం సరిహద్దులు నిర్ధారించి అసలు యజమానికి అప్పగించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, పెసా కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ, గిరిజనుల భూముల రక్షణ విషయంలో చట్టమే అంతిమమని, ట్రైబ్ టు ట్రైబ్ మధ్య జరిగిన భూ అన్యాక్రాంతం విషయంలో న్యాయం కాస్త ఆలస్యమైనా చివరికి చట్టమే గెలిచిందని పేర్కొన్నారు. ఐదో షెడ్యూల్ ప్రాంతమైన చట్టి గ్రామపంచాయతీ పరిధిలో గిరిజనుల భూములపై గిరిజనేతరులు చేసే ఆక్రమణలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. గిరిజనుల భూ హక్కుల పరిరక్షణకు చట్టబద్ధంగా చర్యలు కొనసాగుతాయని తెలిపారు.

## ఈనెల 19న రాష్ట్రస్థాయి బ్రాహ్మణ సమాలోచన సదస్సు

✷ సమస్యల సాధనకు బ్రాహ్మణ సంఘాల్లో ఐక్యత అవసరం




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూలై 15:**రాష్ట్రంలో బ్రాహ్మణులు, బ్రాహ్మణ సంఘాలు పలు సమస్యలు ఎదుర్కొంటున్నాయని వాటి పరిష్కారానికి రాష్ట్రవ్యాప్తంగా బ్రాహ్మణ సంఘాలన్నీ ఐక్యత కావలసిన ఆవశ్యకత ఉందని రాష్ట్ర బ్రాహ్మణ సంఘం డైరెక్టర్ తేజో మూర్తుల విష్ణుమూర్తి అన్నారు. స్థానిక ప్రెస్ క్లబ్ లో బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ, రాష్ట్రంలో పురోహితులు, అర్చకులు, విడి సంఘాలు జీవనోపాధి లేక అలమటిస్తున్నారు. ఈ సమస్యను ఈ సమస్యను పరిష్కరించడానికి ఈనెల 19వ తేదీన నగరంలోని జేఎన్ రోడ్డులో మన్యం గార్డెన్స్ లో రాష్ట్రస్థాయి బ్రాహ్మణ సమాలోచన సదస్సు నిర్వహి స్తున్నామన్నారు. ఈ సదస్సులో రాష్ట్ర స్థాయిలో అన్ని సంఘాలతో కలిసి జేఏసీ ఏర్పాటు చేస్తామని ఈ జేఏసీతోనే రాష్ట్ర ప్రభుత్వాన్ని, ప్రతిపక్షాలను కలుస్తామని అన్నారు. రానున్న పుష్కరాల్లో పురోహితులకు, అర్చకులకు ఉపాధి కల్పించే లాగా భాగస్వామ్యం కల్పించాలన్నారు. సమావేశంలో పానుగంటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## "విశ్వవిద్యాలయ అధ్యాపకుల మండలి సమావేశం"




**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. జూలై 15.**డా. వై.ఎస్.ఆర్. ఉద్యాన విశ్వవిద్యాలయం విద్యా వ్యవహారాల డీన్ డా. బి. ప్రసన్న కుమార్ అధ్యక్షతన, "విశ్వవిద్యాలయ అధ్యాపకుల మండలి సమావేశం" ఈరోజు వెంకటరామన్నగూడెం, ఉద్యాన విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో జరిగింది.

ఈ సమావేశంలో డిగ్రీ , పోస్ట్ గ్రాడ్యుయేషన్ స్థాయి కోర్సులలో రాబోయే విద్యా సంవత్సరంలో విద్యా ప్రమాణాలను మెరుగుపరచడానికి తీసుకోవలసిన చర్యలు గురించి విశ్వవిద్యాలయం స్థాయిలో సంబంధిత అధికారులతో మరియు వివిధ విశ్వవిద్యాలయాల ప్రొఫెసర్స్ తో ఆన్లైన్ ద్వారా సమావేశం నిర్వహించి తగు సూచనలు సలహాలు తీసుకొని, ఒక విద్యా ప్రణాళిక ను రూపొందించారు . ఈ ప్రణాళిక ను ఈ నెల 22 వ తేదిన విశ్వవిద్యాలయం ఉపకులపతి అధ్యక్షతన జరగబోయే అకాడమిక్ కౌన్సిల్ సమావేశంలో ఆమోదించి, రాబోయే విద్యా సంవత్సరం నుండి అమలు చేస్తారు.

ఈ సమావేశంలో విశ్వవిద్యాలయ అధికారులు డా. బి. ప్రసన్న కుమార్, డా. ఎం. మాధవి, డా. సీఎచ్ . రూత్, డా. ఎస్. సూర్యకుమారి, డా. ఎస్.ఎస్. విజయపద్మ , డా. సి. మధుమతి, మరియు వివిధ ఉద్యాన కళాశాలల అసోసియేట్ డీన్లు, శాస్త్రవేత్తలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## నేడు బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పోలవరం ప్రాజెక్టు సందర్శన

✷ రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ మట్టా మంగరాజు




**గోకవరం పెన్ పవర్ జూలై 15:-** నేడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు పోలవరం ప్రాజెక్టు సందర్శించడానికి వస్తున్నందున నిర్వహించబోవు భారీ ర్యాలీ జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ సీనియర్ బిజెపి నాయకులు మట్ట మంగరాజు పిలుపునిచ్చారు. బుధవారం బిజెపి సీనియర్ నాయకులు రాష్ట్ర గౌడ్ కార్పొరేషన్ డైరెక్టర్ మట్టా మంగరాజు పత్రికా ప్రకటన విడుదల చేశారు ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ జీవనాడి పోలవరం ప్రాజెక్టు సందర్శన కోసం16వ తేదీ గురువారం ఉదయం భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ పీవీఎన్ మాధవ్ , రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ , కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ, రాజమండ్రి పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి, శాసనమండలి సభ్యులు సోము వీర్రాజు , రాష్ట్రంలోని పార్లమెంటు సభ్యులు శాసనసభ్యులు శాసనమండలి సభ్యులు రాష్ట్ర పదాధికారులు,జిల్లాల అధ్యక్షులు,ఇతర నాయకులు, మొత్తంగా కమల దళం ర్యాలీగా పోలవరం ప్రాజెక్టు వద్దకు చేరుకుంటారని ఈ కార్యక్రమానికి కాకినాడ జిల్లా బిజెపి అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావు,

అనకాపల్లి జిల్లా బిజెపి ఇన్చార్జి ఎపిఆర్ చౌదరి,

పోలవరం జిల్లా బిజెపి అధ్యక్షులు వీకా బుల్లి కొండల దొర,పెద్ద ఎత్తున జన సమీకరణ చేపట్టారని బిజెపి నాయకులు కార్యకర్తలు అందరూ పాల్గొని విజయ వంతం చేయాలని కోరారు. ఉదయం 9:30 గంటలకు

రాజమండ్రి జీచీ రోడ్డులోని చెరుకూరి ఫంక్షన్ హాల్ నుంచి ర్యాలీప్రారంభించి రామాలయం సెంటర్ – వాజ్ పేయి సెంటర్ – గోరక్షణపేట– అబ్దుల్ కలాం సెంటర్ – వివేకానంద సెంటర్ (కంబాల చెరువు) – సీతంపేట జంక్షన్ – పేపర్ మిల్లు – కాతేరు – తిరుమల రోడ్డు – తొర్రేడు – సీతానగరం – పురుషోత్తపట్నం – ప్రాజెక్టు ప్రాంతం.భారత ప్రధాని నరేంద్ర మోదీ 12సం.ల పాలనలో దేశం అభివృద్ధిలో వేగంగా దూసుకు వెళుతుంది అన్నారు. వికసిత భారత్ లక్ష్య సాధన కోసం, భారత్ ను విశ్వ గురువు చేయడం కోసం నరేంద్ర మోదీ మరియు ఆయన సైన్యం సంకల్పంతో కృషి చేస్తున్నారు.ఆ మార్గంలోనే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించే పోలవరం ప్రాజెక్టు నిర్మాణం విజయవంతంగా పూర్తి చేయాలని నరేంద్ర మోదీ గారు పూర్తి సహకారం అందిస్తున్నారు. ప్రాజెక్టు నిర్మాణ స్థితిగతులు, పర్యాటక విభాగం అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు మరియు కేంద్రం నుంచి ఇంకా కావలసిన సహకారం గురించి కేంద్ర ప్రభుత్వానికి, బిజెపి జాతీయ నాయకత్వానికి తెలియజేయడానికి రాష్ట్ర నాయకత్వం ఈ పోలవరం ప్రాజెక్టు సందర్శన యాత్ర కార్యక్రమం చేపట్టిందని రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ మట్టా మంగరాజు తెలిపారు.

# పంటల బీమాతో రైతులకు రక్షణ





**పెన్ పవర్, ఉంగుటూరు, జూలై 15:**ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీఎం ఎఫ్బీవై) కింద రైతులు ఆగస్టు 15లోపు బీమా ప్రీమియం చెల్లించి పంటలకు బీమా చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి (జేడీఏ) హబీబ్ భాష సూచించారు.

ఉంగుటూరు మండలం నాచుగుంట, నీలాద్రిపురం గ్రామాల్లో బుధవారం నిర్వహించిన "పొలం పిలుస్తుంది" కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. వరి పంటకు ఎకరానికి రూ.850 చెల్లించి మీ సేవ కేంద్రాలు లేదా రైతు సేవా కేంద్రాల ద్వారా బీమా చేయించుకోవాలని, ప్రకృతి వైపరీత్యాల వల్ల కలిగే పంట నష్టాల నుంచి రక్షణ పొందవచ్చని తెలిపారు.


జిల్లా వ్యాప్తంగా వరి నాట్లు కొనసాగుతున్నాయని, ఈ-పంట నమోదు ప్రక్రియ ప్రారంభమైందని పేర్కొన్నారు. రైతులు తమ పంట వివరాలను రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసి ఈ-పంట నమోదు పూర్తి చేసుకోవాలని సూచించారు.

ఎల్నినో ప్రభావం నేపథ్యంలో తీసుకోవాల్సిన వ్యవసాయ జాగ్రత్తలపై కూడా రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భీమడోలు ఏడీఏ ఉషా రాజకుమారి, మండల వ్యవసాయ అధికారి డాక్టర్ ఎన్. ప్రవీణ్ కుమార్, రైతులు పాల్గొన్నారు.




## నేడు పోలవరం ప్రాజెక్టు సందర్శన యాత్ర







**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూలై 15:**ఆంధ్రప్రదేశ్ జీవనాడి – పోలవరం ప్రాజెక్టు సందర్శన కోసం.. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పి వి ఎన్ మాధవ్, రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ , కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ , ఎంపీ పురందేశ్వరి గారు, ఎం ఎల్ సి సోము వీర్రాజు , రాష్ట్రంలోని ఇతర బిజెపి ప్రజా ప్రతినిధులు, రాష్ట్ర పదాధికారులు, జిల్లాల అధ్యక్షులు, ఇతర నాయకులు, 1000 మందితో కూడిన కమల దళం ర్యాలీగా పోలవరం ప్రాజెక్టు వద్దకు చేరుకుంటారు.

ఈ ర్యాలీ గురువారం ఉదయం 9:30 గంటలకుజె ఎన్ రోడ్డులోని చెరుకూరి ఫంక్షన్ హాల్ నుంచి ప్రారంభమ వుతుంది. రామాలయం సెంటర్ – వాజ్ పేయి సెంటర్ – గోరక్షణపేట– అబ్దుల్ కలాం సెంటర్ – వివేకానంద సెంటర్ (కంబాల చెరువు) – సీతంపేట జంక్షన్ – పేపర్ మిల్లు – కాతేరు – తిరుమల రోడ్డు – తొర్రేడు – సీతానగరం – పురుషోత్తపట్నం – ప్రాజెక్టు ప్రాంతానికి చేరుకుంటుంది. ఈ సందర్భంగా బిజెపి ఎమ్మెల్సీ సోము వీర్రాజు మీడియాతో మాట్లాడుతూ, భారత ప్రధాని నరేంద్ర మోదీ 12 సంవత్సరాల పాలనలో దేశం అభివృద్ధిలో వేగంగా దూసుకువెళుతుందన్నారు. వికసిత భారత్ లక్ష్య సాధన కోసం, భారత్ ను విశ్వ గురువు చేయడం కోసం నరేంద్ర మోదీ సైన్యం సంకల్పంతో కృషి చేస్తున్నారన్నారు.

ఆ మార్గంలోనే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించే పోలవరం ప్రాజెక్టు నిర్మాణం విజయవంతంగా పూర్తి చేయాలని నరేంద్ర మోదీ పూర్తి సహకారం అందిస్తున్నార న్నారు. ప్రాజెక్టు నిర్మాణ స్థితిగతులు, పర్యాటక అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేంద్రం నుంచి సహకారం కోరుతున్నా మన్నారు. కేంద్ర ప్రభుత్వానికి, బిజెపి జాతీయ నాయకత్వానికి తెలియజేయడానికి రాష్ట్ర నాయకత్వం పోలవరం ప్రాజెక్టు సందర్శన యాత్ర చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో బిజెపి నాయకులు పిక్కి నాగేంద్ర ఎ పి ఆర్, ఏ పి ఆర్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## స్కూటీకి నిప్పంటించిన కేసులో నిందితుడికి ఏడాది జైలు

రూ.20 వేల జరిమానా



**కాకినాడ, పెన్ పవర్, జూలై 15:** కాకినాడలో స్కూటీకి ఉద్దేశపూర్వకంగా నిప్పంటించిన కేసులో నిందితుడికి ఏడాది కారాగార శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధిస్తూ కాకినాడ 4వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కె. నాగమణి తీర్పు వెలువరించారు. పోలీసుల వివరాల ప్రకారం, 2024 ఫిబ్రవరి 10న రామకృష్ణారావుపేటలో గత విభేదాల కారణంగా నిందితుడు షేక్ రఫీ ఫిర్యాదుదారుడి హోండా డియో స్కూటీకి నిప్పంటించడంతో వాహనం పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనపై కాకినాడ ×× టౌన్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెం.51/2024గా కేసు నమోదు చేశారు. శాస్త్రీయ దర్యాప్తు, బలమైన సాక్ష్యాధారాల ఆధారంగా నిందితుడిని దోషిగా నిర్ధారిస్తూ కోర్టు ఏడాది జైలు శిక్ష, రూ.20 వేల జరిమానా విధించింది. కేసు దర్యాప్తు, విచారణను సమర్థవంతంగా నిర్వహించిన సీఐ మజ్జి అప్పలనాయుడు,అప్పటి ఎస్ఐ టి. సునీత, ఏపీపీ పి.వి.ఎన్. జయలక్ష్మి తదితరులను జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్ అభినందించారు.

## ఇళ్లకు, తాగునీటి బోర్లకు 200 మీటర్ల దూరంలోనే జమాయిల్ పంటలు సాగు చేయాలి



చుటూరు గ్రామస్తుల వినతి

**చింతూరు, పెన్ పవర్, జూలై 15:** ఇళ్లకు, తాగునీటి బోర్లకు కనీసం 200 మీటర్ల దూరంలోనే జమాయిల్ (వాణిజ్య) పంటలను సాగు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ చుటూరు గ్రామస్తులు బుధవారం చింతూరు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారికి నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో వినతిపత్రం సమర్పించారు. గ్రామస్తులు మాట్లాడుతూ, ఇళ్లకు సమీపంలో జమాయిల్ పంటలు సాగు చేయడం వల్ల భూగర్భ జలాల వినియోగం అధికమై తాగునీటి బోర్లలో నీటి మట్టం తగ్గిపోతోందని తెలిపారు. దీంతో గ్రామ ప్రజలు తాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకపై ఇళ్లకు, తాగునీటి బోర్లకు సమీపంలో కొత్తగా జమాయిల్ పంటలు సాగు చేయకుండా చర్యలు తీసుకోవాలని, ఇతర పంటల సాగుపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. జమాయిల్ పంటలను ఇళ్లకు, తాగునీటి బోర్లకు కనీసం 200 మీటర్ల దూరంలోనే సాగు చేసేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసి గ్రామ ప్రజల తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారిని కోరారు.

## స్వర్ణాంధ్ర లక్ష్య సాధనకు నైపుణ్య సామర్థ్య శిక్షణ కీలకం




ఇంచార్జి డి ఆర్వో ఎస్ భాస్కర్ రెడ్డి

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూలై 15:**స్వర్ణాంధ్ర--2047 విజన్ సాధనలో రాష్ట్ర స్థూల ఉత్పత్తి పెంపునకు గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అన్ని ఆర్థిక రంగాల గణాంకాలను శాస్త్రీయ పద్ధతిలో సేకరించడం కీలకమని ఇన్‌చార్జి రెవెన్యూ డివిజనల్ అధికారి ఎస్. భాస్కర్ రెడ్డి అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో బుధవారం ముఖ్య ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కేపాసిటీ బిల్డింగ్ శిక్షణ కార్యక్రమం ముగింపు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా డి ఆర్వో ఎస్ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ, భారత ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణాంధ్ర--2047 విజన్ డాక్యుమెంట్ అమలులో భాగంగా రాష్ట్ర స్థూల ఉత్పత్తి, నికర రాష్ట్ర ఉత్పత్తి అంచనాలను ఖచ్చితంగా రూపొందించేందుకు జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు అనుసరించాల్సిన విధానాలపై ఈ శిక్షణలు నిర్వహించినట్లు తెలిపారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి దోహదపడే ప్రతి రంగానికి సంబంధించిన సమగ్ర సమాచారం సేకరించడం ద్వారా అభివృద్ధి ప్రణాళికలుసమర్థవంతంగా రూపొందించేందుకు వీలు కలుగుతుందన్నారు.

జీడీపీ లెక్కింపులో ప్రైమరీ, సెకండరీ, టెర్షియరీ అనే మూడు ఆర్థిక రంగాల పాత్ర కీలకమని వివరించారు. ఈ మూడు ప్రధాన రంగాలతో పాటు ప్రభుత్వం, ప్రైవేట్ సేవలు, స్థానిక సంస్థల సేవలు, ఆర్థిక సంస్థలు, డిజిటల్ సేవలు తదితర రంగాల సమాచారాన్ని కూడా సమగ్రంగా సేకరించడం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వాస్తవన్ని ప్రతిబింబించే గణాంకాలు సిద్ధమవుతాయన్నారు.

సిపివో ఎల్ అప్పలకొండ మాట్లాడుతూ, గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిల నుంచి ఖచ్చితమైన సమాచారం రాష్ట్ర స్థూల ఉత్పత్తి, నికర రాష్ట్ర ఉత్పత్తి అంచనాలు విశ్వసనీయంగా రూపొందుతాయని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పహలే ఇండియా ఫౌండేషన్ కు చెందిన ఐదుగురు సభ్యుల బృందం, ఇద్దరు రిసోర్స్ పర్సన్స్ సహకారంతో జూలై 2 నుంచి జూలై 15 వరకు జిల్లాలో నిర్వహించా మన్నారు. తొలి దశలో జిల్లా, నియోజకవర్గ స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విజన్ డాక్యుమెంట్‌పై చర్చలు జరిగాయి. జిల్లా అధికారులతో రెండు రోజుల సమీక్షలు , నియోజక వర్గాల వారీగా అధికారులకు శిక్షణ ఇచ్చారు. మండల స్థాయిలో నలుగురు మాస్టర్ ట్రైనర్లను ఎంపిక చేసి వారికి ప్రత్యేక శిక్షణ అందించారు. శిక్షణ కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారిగా సహాయ సంచాలకులు డి.వి. రోహిణి కుమారి సమన్వయం వహించారు.

# సంస్థ అభివృద్ధిలో ఆచార్యుల పాత్ర ఎంతో కీలకం





✷ నిట్ వరంగల్ ప్రొఫెసర్, డాక్టర్ ఎ.వేణు వినోద్

**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. జులై 15:**ఉన్నత విద్యాసంస్థల అభివృద్ధి, నాణ్యమైన బోధన, పరిశోధనలో పురోగతి, జాతీయ – అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించడంలో ఆచార్యుల పాత్ర ఎంతో కీలకమని నిట్ వరంగల్ రసాయన ఇంజినీరింగ్ విభాగం ప్రొఫెసర్, సంస్థ ర్యాంకింగ్ కమిటీ ఛైర్మన్ ప్రొఫెసర్, డాక్టర్ ఎ.వేణు వినోద్ సూచించారు. నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్ (ఏపీ నిట్)లోని సాధారణ పరిపాలన విభాగం ఆధ్వర్యంలో సంస్థ అభివృద్ధిలో అధ్యాపకుల పాత్ర అనే అంశంపై బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథి ప్రొఫెసర్, డాక్టర్ వేణు వినోద్ మాట్లాడుతూ ఆధునిక పోటీ ప్రపంచంలో రాణించాలంటే ఉన్నత విద్యాసంస్థలు నాణ్యత, పరిశోధన, పరిశ్రమలతో అనుసంధానం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ఆ లక్ష్యాలను సాధించడంలో ప్రతి ఆచార్యుడు తన బోధనతో పాటు పరిశోధన, విద్యార్థుల మార్గదర్శకత్వం, సంస్థ పరిపాలన, సామాజిక బాధ్యత కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. జాతీయ, అంతర్జాతీయ ర్యాంకింగ్స్‌లో సంస్థ స్థానాన్ని మెరుగుపరచాలంటే నాణ్యమైన పరిశోధనా పత్రాల ప్రచురణ, పరిశ్రమలతో సంయుక్త పరిశోధనలు, పేటెంట్లు, బాహ్య పరిశోధన నిధుల సమీకరణ, సాంకేతిక పరిజ్ఞాన బదిలీ వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ఆచార్యులు నిరంతరం కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని అలవర్చుకుని విద్యార్థుల్లో ఆవిష్కరణాత్మక ఆలోచనలను పెంపొందించేలా బోధన సాగించాలని సూచించారు. విద్యార్థుల సమగ్ర వికాసమే ప్రతి ఆచార్యుడి ప్రధాన బాధ్యత అని, విద్యార్థుల్లో నైతిక విలువలు, నాయకత్వ లక్షణాలు, సమస్య పరిష్కార నైపుణ్యాలు, సామాజిక బాధ్యత పెంపొందించేలా మార్గనిర్దేశం చేయాలని తెలిపారు. బోధనతో పాటు మెంటారింగ్‌కు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని వివరించారు. ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి మాట్లాడుతూ సంస్థ అభివృద్ధి అనేది ఒక్కరి కృషితో సాధ్యం కాదని తెలిపారు. ఆచార్యులు, అధికారులు, సిబ్బంది, విద్యార్థుల సమిష్టి సహకారంతోనే అత్యుత్తమ ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు. ప్రతి ఆచార్యుడు సంస్థ లక్ష్యాలను తన వ్యక్తిగత లక్ష్యాలుగా భావించి కృషి చేస్తే విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడటంతో పాటు దేశంలోనే అగ్రగామి విద్యాసంస్థగా ఎదగటం సాధ్యమవుతుందని వివరించారు. డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ డాక్టర్ డాక్టర్ జి.రవి కిరణ్ శాస్త్రి మాట్లాడుతూ ఆచార్యులు తమ వృత్తిపరమైన నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకుంటూ పరిశోధన, బోధన, నవకల్పనల ద్వారా సమాజాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు.



ఈ కార్యక్రమానికి డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ వినోత్ కుమార్ రాజా కో ఆర్డినేటర్ గా వ్యవహరించారు.. అనంతరం అతిథి, ప్రొఫెసర్ వేణు వినోద్ ను శాలువా, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. ముందుగా ఆచార్యుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో డీన్లు డాక్టర్ వి.సందీప్, డాక్టర్ జీబి.విరేష్ కుమార్, డాక్టర్ హిమబిందు, పలువురు విభాగాధిపతులు, ఆచార్యులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల నిర్మూలనకు సమన్వయంతో చర్యలు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూలై 15:**న్యూఢిల్లీ కేంద్రంగా ఎన్‌సీపీసీఆర్ ఆధ్వర్యంలో, ఎన్‌సీబీ సహకారంతో నిర్వహిస్తున్న “ఏక్ యుద్ధ్ నషే కే విరుద్ధ్” ఉమ్మడి కార్యాచరణ ప్రణాళిక అమలు పురోగతిపై బుధవారం నిర్వహించిన జాతీయ స్థాయి వీడియో కాన్ఫరెన్స్‌లో తూర్పు గోదావరి జిల్లా అధికారులు కలెక్టరేట్ నుంచి పాల్గొన్నారు. పిల్లల్లో మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల వినియోగాన్ని నివారించడం, అక్రమ రవాణాను అరికట్టడం, పాఠశాలలు, కళాశాలలు, గ్రామాలు, పట్టణాల్లో అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించడం, ప్రమాదానికి గురయ్యే పిల్లలను ముందస్తుగా గుర్తించి వారికి కౌన్సెలింగ్, చికిత్స, పునరావాస సేవలు అందించడం వంటి అంశాలపై ఎన్‌సీపీసీఆర్ అధికారులు మార్గనిర్దేశం చేశారు. తూర్పు గోదావరి జిల్లాలో చేపడుతున్న కార్యాచరణను జిల్లా రెవెన్యూ అధికారి ఎస్. భాస్కర్ రెడ్డి వివరించారు. బాల్య వివాహాల నిరోధక చట్టం--2006, బాలల హక్కులు, పీసీపీఎన్‌డీటీ చట్టం, పీఓసీఎస్‌ఓ చట్టం, బాలల రక్షణకు వివిధ శాఖల సమన్వయంతో జిల్లా వ్యాప్తంగా విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తు న్నట్లు తెలిపారు.

జనవరి--2024 నుంచి జూన్--2026 వరకు 1,506 అవగాహన కార్యక్రమాలు నిర్వహించి 79,563 మంది పాల్గొనేలా చేసినట్లు వివరించారు. విద్యాసంస్థల్లో 351 కార్యక్రమాలు నిర్వహించి 37,442 మంది విద్యార్థులకు బాలల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు.

, బాలల సంక్షేమ కమిటీ (సీడబ్ల్యూసీ) ద్వారా సంరక్షణ అవసరమున్న పిల్లలకు రక్షణ, కౌన్సెలింగ్, పునరావాస సేవలను అందిస్తున్నట్లు తెలిపారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఆర్. అనంత ప్రదీప్, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి మహమ్మద్ గాయాజుద్దీన్, జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమ అధికారి డా. అఖిలేంద్ర శ్రీనివాస్‌తో పాటు మహిళా, శిశు సంక్షేమ, పోలీసు, వైద్య ఆరోగ్య, విద్య తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## హౌసింగ్ నిర్మాణాలు పూర్తికాకుండానే బిల్లులు చెల్లింపు - తప్పు ఎవరిది?



**వై రామవరం,పెన్ పవర్, జూలై 15 :** మండలంలో కొన్ని గ్రామాలలో హౌసింగ్ కాలనీల నిర్మాణాలు పూర్తి కాకుండానే పూర్తిగా బిల్లులు మార్చేసుకున్నారని లబ్ధిదారుల ఆరోపిస్తున్నారు.

మండలంలో యార్లగడ్డ పంచాయతీ గొర్రమంద గ్రామములో కొండ్ల రేఖమ్మ అనే గిరిజన మహిళ నిర్మాణం పూర్తి కాకుండానే తమ నిరక్షరాస్యతను ఆసరాగా చేసుకుని వేలిముద్రలు వేయించుకొని బిల్లులు తీసుకున్నారని ఆరోపించారు. ప్రభుత్వం మంజూరు చేసిన నగదు కాకుండానే, తన వద్ద 50 వేల రూపాయలు తీసుకున్నారని అయినా నిర్మాణం పూర్తి చేయలేదని ఆమె ఆరోపిస్తున్నారు. కాంట్రాక్టర్, హౌసింగ్ అధికారులు కుమ్మక్కై నిధులు మార్చేసుకున్నట్లు ఆమె అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న హౌసింగ్ కాలనీల



నిర్మాణాలను పూర్తి చేయించాలని లబ్ధిదారులు కోరుచున్నారు.

# జిల్లాలో ద్వితీయ స్థానం. డివిజన్‌లో మొదటి స్థానం



ఈఎఫ్ డిజిటైజేషన్‌లో చింతూరు మండలానికి ఘనత

**చింతూరు, పెన్ పవర్, జూలై 15:** ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో చింతూరు మండలం ఉత్తమ ప్రతిభ కనబరిచింది. 100 శాతం ఈఎఫ్ (ఎన్యుమరేషన్ ఫార్మ్స్) డిజిటైజేషన్ పూర్తి చేసి జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం, డివిజన్ స్థాయిలో మొదటి స్థానాన్ని సాధించింది. ఈ సందర్భంగా మండల తహశీల్దార్, మండల ఎన్నికల అధికారి గుబ్బల అర్జున్ రావు మాట్లాడుతూ రెవెన్యూ, ఎన్నికల సిబ్బంది, 40 మంది బీఎల్ఓలు సమిష్టి కృషి, ప్రజల సహకారంతో ఈ ఘనత సాధ్యమైందన్నారు. మండల పరిధిలోని 30,777 మంది ఓటర్ల వివరాలను ఇంటింటి సర్వే ద్వారా పరిశీలించి డిజిటల్ నమోదు చేసినట్లు తెలిపారు. ఈ ప్రక్రియలో మృతి చెందిన 2,837 మంది, బదిలీ అయిన 967 మంది, డబుల్ ఎంట్రీలు 531, గైర్హాజరైన 173 మంది ఓటర్ల వివరాలను గుర్తించినట్లు వెల్లడించారు. ఎన్నికల జాబితాను మరింత పారదర్శకంగా, తప్పులులేకుండా రూపొందించేందుకు సిబ్బంది అంకితభావంతో పనిచేశారని, ఈ విజయం మండలానికి గర్వకారణమని అర్జున్ రావు తెలిపారు. కృషి చేసిన అధికారులు, సిబ్బంది, బీఎల్ఓలు, ప్రజలకు ఆయన అభినందనలు తెలిపారు.




## మహిళల భద్రత మనందరి బాధ్యత-ఏఎస్పీ హేమంత్



**చింతూరు, పెన్ పవర్, జూలై 15:**మహిళల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని చింతూరు ఏఎస్పీ హేమంత్ పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశాల మేరకు బుధవారం చింతూరు వారాంతపు సంతలో మహిళల భద్రత, సైబర్ నేరాల నివారణ, రోడ్డు భద్రత, మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన ర్యాలీ, సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ మహిళలు, యువత మొబైల్ ఫోన్ల ద్వారా జరుగుతున్న సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిచితుల నుంచి వచ్చే కాల్స్, సందేశాలు, లింకులను నమ్మవద్దని, డిజిటల్ అరెస్ట్ పేరుతో వచ్చే మోసపూరిత కాల్స్‌ను విశ్వసించకుండా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. మహిళలు, విద్యార్థినులను ఎవరైనా ఈవ్‌టీజింగ్‌కు గురిచేస్తే వెంటనే 112కు కాల్ చేయాలని, అలాగే శక్తి యాప్‌ను తప్పనిసరిగా డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. మహిళలపై వేధింపులు, మోసాలు లేదా అనుమానాస్పద ఘటనలు జరిగిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని అన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చిన ఆయన, గంజాయి సేవించడం, అక్రమ రవాణా చేయడం లేదా అలాంటి కార్యకలాపాలకు సహకరించడం తీవ్రమైన నేరమని హెచ్చరించారు. గంజాయి అక్రమ వ్యాపారం ద్వారా సంపాదించిన ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం కూడా నేరమేనని, డ్రోన్ కెమెరాల ద్వారా నిఘా పెట్టి ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే అతివేగంగా వాహనాలు నడపడం, లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేయడం, ద్విచక్ర వాహనాలపై ముగ్గురు లేదా నలుగురు ప్రయాణించడం చట్టవిరుద్ధమని తెలిపారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని, ఇచ్చిన తల్లిదండ్రులపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అపరిచితులు లేదా అనుమానాస్పద వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని కోరారు. అనంతరం యువత, ప్రజలతో రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సీఐ గోపాలకృష్ణ, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ కన్నప రాజు, పోలీసు సిబ్బంది, మహిళలు, యువత, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో నైపుణ్యాలు, సృజనాత్మకత పెంపొందించే లక్ష్యంతో యువత ముందుకు నడవాలి.



**గోకవరం పెన్ పవర్ జులై 15:-** విద్యార్థి దశ నుంచే యువత నైపుణ్యాలు సృజనాత్మకత వైపు పయనించాలని ప్రిన్సిపాల్ డా. జి వి.లలిత కుమారి అన్నారు. ప్రపంచ యువ నైపుణ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జగ్గంపేట లో డాక్టర్ బి ఆర్ . అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఒకేషనల్ స్కిల్ ట్రైనర్లు (ఐటి మరియు బి ఎఫ్ ఎస్ ఐ ) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో నైపుణ్యాలు, సృజనాత్మకత పెంపొందించే లక్ష్యంతో డ్రాయింగ్, క్విజ్, రోల్‌ప్లే, ప్రాజెక్ట్ వర్క్ పోటీలను నిర్వహించారు.

కళాశాల ప్రిన్సిపాల్ డా. జి వి.లలిత కుమారి మాట్లాడుతూ,విద్యతో పాటు వృత్తి విద్యా నైపుణ్యాలను అభ్యసించడం ద్వారా వ్యక్తిగత జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకోవడమే కాకుండా, భవిష్యత్తులో మరెందరికో ఉపాధి కల్పించే వ్యవస్థాపకులుగా ఎదిగే అవకాశం ఉంటుంది అన్నారు,మీ చదువు, మీ నైపుణ్యాల ఆధారంగా ప్రపంచంలో ఎక్కడైనా ఆత్మవిశ్వాసంతో, స్వతంత్రంగా జీవించగలుగుతారని విద్యార్థులకు సూచించారు.

పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ తో పాటు ఉపాధ్యాయులు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు.విద్యార్థులకు మార్గదర్శకత్వం అందించి, వారి ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేలా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ఒకేషనల్ స్కిల్ ట్రైనర్లు ఎన్. వీరమణి మరియు పి. మౌనిక లను ప్రిన్సిపాల్ అభినందించారు.

## పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

✷ మండల బిజెపి అధ్యక్షుడు ఇనకోటి బాపన్న దొర



**గోకవరం పెన్ పవర్ జులై 15:**-పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాట లని గోకవరం మండలం భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు ఇనకోటి బాపన్న దొర పిలుపు నిచ్చారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్ఫూర్తితో, రాష్ట్ర అధ్యక్షులు పీ.వీ.ఎన్. మాధవ్, కాకినాడ జిల్లా అధ్యక్షులు బిక్కిని విశ్వేశ్వరరావు ఆదేశాల మేరకు గోకవరం మండల కేంద్రంలోని స్థానిక జూనియర్ కళాశాల ప్రాంగణంలో కూటమి ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు.కళాశాల అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి పలురకాల మొక్కలను నాటారు. అనంతరం ప్రతి విద్యార్థి ఒక మొక్కను నాటి దానిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు.

పర్యావరణం కాపాడటం ద్వారా భావితరాలకు ఆరోగ్యకరమైన, భవిష్యత్తును అందించవచ్చని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములై మొక్కల పెంపకాన్ని జీవితంలో ఒక బాధ్యతగా స్వీకరించాలని కోరారు. మాతృమూర్తికి వందనం అనే కార్యక్రమం ద్వారా ఈ మొక్కలు నాటే కార్యక్రమానికి మండల వ్యాప్తంగా చేపడుతున్నామని తెలిపారు ఈ కార్యక్రమంలో.. స్టేట్ కౌన్సిల్ మెంబర్ సత్తి వెంకట రెడ్డి , జిల్లా కార్యదర్శి కోన వెంకట సురేష్, బిజెపి సీనియర్ నాయకులు రైల్వే బోర్డ్ మెంబర్ బత్తుల వెంకన్న బాబు, మండల ప్రధాన కార్యదర్శి ముప్పిడి నాగేశ్వరరావు, ఎంఈఓ, చిమ్మరాజు దొర, జూనియర్ కళాశాల లెక్చరర్ సుధాకర్ రెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

## టిడిపిపార్టీ,కార్యకర్తల విస్తృత,స్థాయిసమావేశం

**-టిడిపిపార్టీ,మండలకమిటీ,సభ్యులు తీర్మానం**



**వి.ఆర్.పురం పెన్.పవర్.జూలై.15**
ఆంధ్రప్రదేశ్,రాష్ట్ర ముఖ్యమంత్రి,రాష్ట్ర తెలుగుదేశం పార్టీఅధ్యక్షులు,నారాచంద్రబాబునాయుడు,వర్కింగ్, ప్రెసిడెంట్,నారాలోకేష్,ఆదేశానుసారం రాష్ట్రఅధ్యక్షులు,పల్లాశ్రీనివాస్,యాదవ్,రంపచోడవరంనియోజకవర్గంఎమ్మెల్యే,మిర్యాలశిరీష,దేవి,సూచనలమేరకు బుధవారంమండల తెలుగుదేశంపార్టీ,ఆధ్వర్యంలో తెలుగుదేశంపార్టీకార్యకర్తల,విస్తృతస్థాయి,సమావేశం టిడిపిపార్టీ,మండలఅధ్యక్షులు బొర్రా నరేష్,కుమార్, అధ్యక్షతనలో,నిర్వహించడంజరిగింది.ఈసమావేశాని కి,ముఖ్యఅతిథులుగా మండలక్లస్టర్,ఇంచార్జ్,వాళ్ళ రంగారెడ్డి,మాజీ జెడ్పిటిసి ముత్యాల రామారావు పాల్గొని,మాట్లాడారు.ఈకార్యక్రమం యొక్కఏజెండా?మండలఅభివృద్ధి,పార్టీ సంస్థాగత ఎన్నికలకు సంబం ధించి,పార్టీ తీర్మానాలు1.2024-2025 సంవత్సరం కు,సంబంధించిన,వరదనష్ట,పరిహారం ప్రభుత్వం చెల్లించాలని,తీర్మానం,2.పెదమట్టపల్లి, నుండితెల్లవారి,గూడెం మీదుగా నర్సింగపేట,రహదారి,నిర్మాణంకొరకు,3.పోల వరం ప్రాజెక్టు,కారణంగా వి.ఆర్.పురంమండలంలో సుమారుఎనబైశాంతం ముంపున కుగురి,కావడం జరుగుతుందని,పునరా వాసకాలనీలలోమౌలిక సదుపాయాలుకల్పించాలని,18సంవత్సరాలు,నిండిన యువతీ,యువకులకు,ఆర్.అండ్.ఆర్.గురించి, వి.ఆర్.పురం,మండలవివిధ సమస్యలపై,ప్రత్యేక శ్రద్ధ,చూపాలని,పైన,తెలపబడిన,అంశాలను,టిడిపి పార్టీ,మండలకమిటీ సభ్యులు తీర్మానం చేశారు. మండలంలోని నిర్వాసితుల,సమస్యలను,టిడిపి పార్టీ,మండలకమిటీ సభ్యులు,త్వరలో మనరాష్ట్ర, ముఖ్యమంత్రి,నారా చంద్ర బాబునాయుడు,దృష్టి కుతీసుకుపోవడం,జరుగుతుందని,ఒక ప్రకటనలో తెలిపారు.ఈ కార్యక్రమంలోయూని ట్,ఇన్ చార్జ్, బొర్రానరసింహారావు,టిడిపిపార్టీ,నాయకులుబీరక సూర్యప్రకాష్,రావు,మండలసొసైటీ,మాజీ అధ్యక్షులు ముత్యాలచంద్రశేఖర్,టిడిపిపార్టీ,నాయకులు బోదు బోయిన సురేష్,కోట్లశ్రీను,నాలారపుసత్యనారాయణ, బొర్రాసూరి,రేపుసింహాచలం,వడ్డానపుసత్యనారాయణ, పెట్టాముత్యాలరావు,శ్రీధర్,అప్పాజీ,శంకర్,చక్రపాణి,దుర్గారావు,వెంకన్న,పోసిబాబు,మామిడిరాజు,బింగివిష్ణుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు లేక రెండేళ్ల చిన్నారి మృతి.

- కొండారెడ్డి గ్రామాలకు 5 కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి చర్యలు
- స్పందించిన ఐటీడీఏ పీఓ





**చింతూరు, పెన్ పవర్ జూలై 15:** ఏడుగురాళ్లపల్లి పంచాయతీ పరిధిలోని కొండారెడ్డి గ్రామాలకు రహదారి నిర్మాణం చేపట్టాలని కోరుతూ గ్రామస్తులు ఐటీడీఏ పీఓ శుభం నొక్వల్‌కు వినతిపత్రం అందజేశారు. బుధవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఎడమ అర్జున్ ఆధ్వర్యంలో చల్లకవ్వం, ఉప్పనపల్లి గట్టు, చింతపల్లి, వేగిసగండి, తేనెరాయి, పెద్దవాగు, విటుకాపాడు గ్రామాలకు చెందిన కొండారెడ్డి గ్రామస్తులు పీఓను కలిసి సమస్యను వివరించారు. తాటిలంక క్రాస్ రోడ్ నుంచి ఉప్పనపల్లి గట్టు వరకు సుమారు 5 కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. పూర్తిగా ఆదివాసీ కొండారెడ్డి గ్రామాల ప్రజలు ఈ మార్గంపైనే రాకపోకలు సాగిస్తున్నారని, సరైన రహదారి లేక అత్యవసర వైద్య సేవలు అందక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. గత నెల 7వ తేదీన రెండేళ్ల చిన్నారి పాము కాటుకు గురై మృతి చెందిన ఘటనను గ్రామస్తులు పీఓ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన పీఓ శుభం నొక్వల్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం అక్కడే ఉన్న పంచాయతీరాజ్ శాఖ డీఈని పిలిచి రహదారి పరిస్థితిపై క్షేత్రస్థాయి పరిశీలన చేసి నివేదిక అందించాలని ఆదేశించారు. పీఓ స్పందనపై ఆదివాసీ కొండారెడ్డి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సవలం సత్తిబాబు, మాజీ ఉప సర్పంచ్ బి. బాబురావు, కదల సుధాకర్ రెడ్డి, కదల కొండారెడ్డి, ఎర్రరెడ్డి, బిమిరెడ్డి, కదల గంగిరెడ్డి, ఉయిక బాబు, మహేష్, దుర్గారావు, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## పెద్దాపురం డీడీవోగా కర్రె స్వప్న నియామకం



**కాకినాడ, పెన్ పవర్, జూలై 15**: పిఠాపురం ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న కర్రె స్వప్న పదోన్నతి పొంది పెద్దాపురం డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా బుధవారం కాకినాడ కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలిసి ఆశీర్వాదాలు, అందుకున్నారు.

# ముఖ్యమంత్రి పర్యటనకు ముమ్మర ఏర్పాట్లు



**హెలిప్యాడ్, సభా ప్రాంగణ పనులను పరిశీలించిన జాయింట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్**

**గంగవరం /రంపచోడవరం,పెన్ పవర్ జూలై 15 :**రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి చేపట్టిన ముందస్తు ఏర్పాట్లు వేగంగా కొనసాగుతున్నాయని పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్ తెలిపారు. బుధవారం రంపచోడవరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్ ప్రాంతాన్ని, అలాగే స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో జరుగుతున్న ఏర్పాట్లను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటన విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనులు చేపడుతున్నారని చెప్పారు. హెలిప్యాడ్ నిర్మాణం, సభా ప్రాంగణం, ఇతర మౌలిక సదుపాయాల ఏర్పాట్లను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.పర్యటనకు సంబంధించిన అధికారిక అనుమతులు వచ్చిన వెంటనే కార్యక్రమ వివరాలను ప్రజలకు వెల్లడిస్తామని జాయింట్ కలెక్టర్ తెలిపారు. ఎలాంటి లోపాలకు తావు లేకుండా ప్రతి ఏర్పాటును పకడ్బందీగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.ఈ పరిశీలనలో జిల్లా రెవెన్యూ అధికారి పి. అంబేద్కర్, జిల్లా పంచాయతీ అధికారి చంద్రశేఖర్, తహసీల్దార్ సి.హెచ్. బాలాజీ, కార్యనిర్వాహక ఇంజనీర్ ఐ. శ్రీనివాసరావు, డిప్యూటీ ఇంజనీర్ భవాని, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి


# జూలై 24 వరకు అవకాశం... ఓటరు వివరాలు తప్పనిసరిగా పరిశీలించండి




**అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా సహకరించాలి: జిల్లా ఎన్నికల అధికారి కె. దినేష్ కుమార్**

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్ జూలై 15 :** ప్రత్యేక విస్తృత ఓటరు జాబితా సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్--2026)లో పోలవరం జిల్లా ప్రజలు విశేష సహకారం అందించడంతో జిల్లా పరిధిలోని 399 పోలింగ్ కేంద్రాల్లో అన్ని అంశాల్లో 100 శాతం లక్ష్యాన్ని విజయవంతంగా పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు.బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, ఓటర్ల సౌకర్యార్థం ప్రత్యేక విస్తృత సవరణ కార్యక్రమంలో వివరాల సమర్పణకు భారత ఎన్నికల సంఘం గడువును జూలై 24, 2026 వరకు పొడిగించిందని వెల్లడించారు. ప్రతి అర్హ ఓటరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ వివరాలను ఒకసారి పరిశీలించుకోవాలని కోరారు.జిల్లాలో మొత్తం 2,78,518 మంది ఓటర్ల వివరాలను పరిశీలించగా, అందులో 2,38,294 మంది ఓటర్ల వివరాల డిజిటలైజేషన్ పూర్తయిందన్నారు. పరిశీలనలో 21,766 మంది మరణించిన ఓటర్లు, 8,387 మంది శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు మారినవారు, 5,494 మంది ఇతర ప్రాంతాల్లో ఇప్పటికే ఓటర్లుగా నమోదైనవారు, 4,545 మంది గైర్హాజరైనవారు, 32 మంది ఇతర కారణాలతో గుర్తించబడినట్లు తెలిపారు.ఇతర ప్రాంతాలకు మారిన వారిగా గుర్తించిన వారిలో ఎవరైనా ఇప్పటికీ అదే పోలింగ్ కేంద్రం పరిధిలో నివసిస్తూ ఓటు హక్కుకు అర్హులై ఉంటే, జూలై 24లోపు తమ పరిధిలోని బూత్ స్థాయి అధికారిని (బీఎల్ఓ) సంప్రదించి అవసరమైన ఆధారాలను సమర్పించాలని సూచించారు. వివరాలను పరిశీలించి ఎన్నికల సంఘం నిబంధనల మేరకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూడటం ఎన్నికల సంఘం ప్రధాన లక్ష్యమని పేర్కొన్న కలెక్టర్, కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, పొరుగువారికి కూడా ఈ విషయాన్ని తెలియజేసి ప్రతి అర్హ ఓటరు తమ వివరాలను తప్పనిసరిగా ధృవీకరించుకునేలా చైతన్యం కల్పించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.జిల్లాలో ఓటరు జాబితాను మరింత ఖచ్చితత్వంతో, పారదర్శకంగా రూపొందించేందుకు ప్రజల సహకారం అత్యంత అవసరమని జిల్లా ఎన్నికల అధికారి కె. దినేష్ కుమార్ పునరుద్ఘాటించారు.

## ముద్రగడ మృతి పట్ల కత్తిపూడి గ్రామంలో స్వచ్ఛంగా బంద్ ప్రకటించిన గ్రామస్తులు...






**శంఖవరం పెన్ పవర్ జులై 15:-** శంఖవరం మండలం కత్తిపూడిలో అకాల మరణం చెందిన ఉద్యమనేత, మాజీ మంత్రి, సీనియర్ వైస్సార్సీపి సీనియర్ నాయకులు ముద్రగడ పద్మనాభం అశ్రు నివాళులు అర్పిస్తూ, కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం లో ఈరోజు కత్తిపూడిలో విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, షాపులకు బంద్ పిలుపునిచ్చిన వైస్సార్సీపీ శ్రేణులు. అయన మృతిపట్ల, గ్రామంలో ముద్రగడకు ఉన్న అనుబందాన్ని గుర్తు చేసుకుంటూ గ్రాములో పలువురు నివాళులు అర్పించడం జరిగింది. గ్రామస్తులు, వ్యాపారులు, విద్యాసంస్థలు బంద్ పాటించి ఆయన మృతి పట్ల మౌనం పాటించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అడపా సోమేష్, గౌతు వాసు, జీలకర్ర లక్ష్మణ్, మాదేపల్లి మహేష్, తోటాడ సన్నీ, కొల్లా చిన్నా, దేవర కిషోర్, నాని, కృష్ణారావు దుర్గ, వైస్సార్సీపి శ్రేణులు పాల్గొన్నారు

## ముద్రగడ పద్మనాభంకు కోలంక గ్రామ ప్రజల ఘన నివాళి



**కాజులూరు, పెన్ పవర్, జూలై 15:** కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి స్వర్గీయ ముద్రగడ పద్మనాభం మృతికి కాజులూరు మండలం కోలంక గ్రామ ప్రజలు రాజకీయాలకు అతీతంగా ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. నీతి, నిజాయితీకి మారు పేరుగా నిలిచి, నమ్మిన సిద్ధాంతం కోసం రాజీలేని పోరాటం చేసిన మహానాయకుడిగా, తన సొంత ఆస్తులను ప్రజా సేవకు వెచ్చించి పేద ప్రజలకు అండగా నిలిచిన గొప్ప వ్యక్తిగా ఆయనను కొనియాడారు. ముద్రగడ పద్మనాభం చేసిన సేవలు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొంటూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అలాగే, ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## బార్లపూడి క్రాంతిని అడ్డుకున్న ముద్రగడ అభిమానులు.

**-నీవల్లే ముద్రగడ చనిపోయారని క్రాంతి పై ఆరోపణలు గుప్పించిన అభిమానులు.**



**కిర్లంపూడి, పెన్ పవర్, జూలై 15:** మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం కుమార్తె, బార్లపూడి క్రాంతిని ముద్రగడ అభిమానులు అడ్డుకున్నారు. తన తండ్రిని కడసారి చూపు చూసేందుకు వచ్చిన బార్లపూడి క్రాంతి పై ముద్రగడ అభిమానులు విరుసుకు పడ్డారు. తమ అభిమాన నాయకుడు ముద్రగడ పద్మనాభం నీ వల్లే మానసికంగా కృంగిపోయి మృతి చెందారని తక్షణమే ఇక్కడినుండి వెళ్లిపోవాలని నినాదాలు చేశారు. గేటు వద్ద అడ్డుకున్న క్రాంతి ముద్రగడ పార్దేవ దేహం వరకు వచ్చి బోరున విలపించారు. ముద్రగడ కుటుంబ సభ్యులు కూడా క్రాంతిని వెళ్లిపోవాలని ఆజ్ఞాపించడంతో క్రాంతి అక్కడినుండి బోరున విలపిస్తూ పోలీసుల సహాయంతో బయటికి వచ్చేసారు. దీంతో అక్కడ కొద్ది బుద్ధ వాతావరణం చోటు చేసుకున్నప్పటికీ క్రాంతి వెను తిరగడంతో వివాదం సద్దుమడిగింది.

## విలువలతో కూడిన రాజకీయ నాయకుడు ముద్రగడ.



**-ఆయన మృతి రాష్ట్రానికి తీరని లోటు.**

**-రాష్ట్ర భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు పివిఎన్ మాధవ్**

**కిర్లంపూడి, పెన్ పవర్, జూలై15:** విలువలతో కూడిన గొప్ప ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం అని ఆయన మృతి వారి కుటుంబ సభ్యులకే కాకుండా, రాష్ట్రానికి ఎంతో తీరనిలోటని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ అన్నారు.బుధవారం ఉదయం కిర్లంపూడి చేరుకుని ముద్రగడ పార్థివ దేహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం ముద్రగడ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియజేశారు.ఈ సందర్భంగా రాష్ట్ర బిజెపి అధ్యక్షులు పివిఎన్ మాధవ్ మాట్లాడుతూ విలువలతో కూడిన రాజకీయం ముద్రగడ జీవితం ఆదర్శ రాజకీయానికి నిదర్శనమన్నారు.పదవుల కోసం కాకుండా ప్రజల కోసం పనిచేసిన నాయకుడు. బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడారన్నారు.ఆయన వెంట కాకినాడ జిల్లా బిజెపి అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావు, కిర్లంపూడి మండలం బిజెపి అధ్యక్షులు శరకణం రాజబాబు, ప్రత్తిపాడు మండలం బిజెపి అధ్యక్షులు ఊట వీరబాబు, బిజెపి సీనియర్ నాయకులు అల్లు శివరామకృష్ణ, తోట గోపి,పెంటకోట సత్యనారాయణ, కంటా కాశీ విశ్వనాథం, దొడ్డ అప్పారావు, కోనేటి శ్రీనివాసరావు, పసుపులేటి సత్తిబాబు నైదాన రవి, తదితరులు ఉన్నారు.

## భారత్ జం పాక్ మ్యాచ్‌ల కోసం ఐసీసీ సంచలన మార్పులు.. క్రికెట్ ఫ్యాన్స్‌కు బిగ్ షాక్!



**హైదరాబాద్ పెన్ పవర్:** అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (×జజ) ప్రపంచ క్రికెట్ అభిమానులకు సరికొత్త మజాను అందించేందుకు సిద్ధమైంది. ఎడిన్‌బర్గ్‌లో ముగిసిన వార్షిక సమావేశంలో, ఐసీసీ బోర్డు రెండు మెగా టోర్నమెంట్ల ఫార్మాట్లలో విప్లవాత్మక మార్పులను అధికారికంగా ప్రకటించింది. టోర్నీ ప్రారంభ దశ నుంచే ప్రతి మ్యాచ్ ఉత్కంఠభరితంగా కొనసాగించాలనే ఉద్దేశంతో ఈ సంచలన నిర్ణయం తీసుకుంది. 2027లో జరగబోయే పురుషుల వన్డే ప్రపంచకప్‌తో పాటు 2028లో జరిగే టీ20 ప్రపంచకప్‌ల కొత్త రూపురేఖలు ఎలా ఉండబోతున్నాయో ఇప్పుడు తెలుసుకుందాం..

**2027 వన్డే ప్రపంచకప్:**

దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియాల సంయుక్త ఆతిథ్యంలో 2027లో జరగనున్న వన్డే ప్రపంచకప్ 14 జట్లతోనే జరగనుంది. కానీ, ఈసారి టోర్నీ కేవలం గ్రూప్ మ్యాచ్‌లతో కాకుండా సరికొత్త నాలుగు దశల ఫార్మాట్‌లో సాగనుంది.

మొదటి దశ (సూపర్ సిరీస్): అర్హత సాధించిన 14 జట్లలో అత్యంత తక్కువ ర్యాంకింగ్ కలిగిన చివరి 3 జట్లు మొదట సూపర్ సిరీస్ రౌండ్ -రాబిన్ లీగ్‌లో తలపడతాయి. వీటిలో కేవలం ఒకే ఒక జట్టు తదుపరి గ్రూప్ దశకు అర్హత సాధిస్తుంది, మిగిలిన రెండు జట్లు టోర్నీ ప్రారంభంలోనే వెనుదిరుగుతాయి.

రెండో దశ (గ్రూప్ స్టేజ్): మిగిలిన 12 జట్లను రెండు గ్రూపులుగా (ఒక్కో గ్రూప్‌లో 6 జట్లు) విభజిస్తారు. లీగ్ మ్యాచ్‌లు పూర్తయిన తర్వాత.. ప్రతి గ్రూప్ నుంచి టాప్--3 స్థానాల్లో నిలిచిన జట్లతో పాటు రెండు గ్రూపుల్లో కలిపి అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన ఒకే ఒక్క నాలుగో స్థాన జట్టు (మొత్తం 7 జట్లు) సూపర్ 7 దశకు చేరుకుంటాయి.

మూడో దశ (సూపర్ 7): ఈ 7 జట్ల మధ్య రౌండ్-రాబిన్ పద్ధతిలో 21 లీగ్ మ్యాచ్‌లు జరుగుతాయి. ఇందులో మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లు సెమీఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి.

నాలుగో దశ (నాకౌట్స్): సెమీఫైనల్స్ లో మొదటి స్థానంలో నిలిచిన జట్టు నాలుగో స్థానంలోని జట్టుతో, రెండో స్థానంలో ఉన్న జట్టు మూడో ప్లేస్ లోని టీమ్ తో తలపడతాయి. విజేతలు ఫైనల్స్‌లో తలపడి ట్రోఫీ కోసం పోరాడతారు.

**భారత్- పాక్ పోరు.. ఒకే టోర్నీలో రెండుసార్లు ఫైట్:**

క్రికెట్ ప్రపంచంలోనే అత్యంత క్రేజ్ ఉన్న భారత్ వర్సెస్ పాకిస్తాన్ మ్యాచ్‌ల విషయంలో ఈ కొత్త ఫార్మాట్ అభిమానులకు డబుల్ ధమాకా ఇవ్వనుంది. ఈ కొత్త నియమాల ప్రకారం భారత్, పాకిస్తాన్ జట్లు ఒకే గ్రూప్‌లో ఉంటే గనుక.. ఈ మెగా టోర్నీలో కనీసం రెండుసార్లు తలపడే అవకాశం లభిస్తుంది. మొదట గ్రూప్ దశలో ఒకసారి ముఖాముఖి పోరాడగా, ఆ తర్వాత ఇరు జట్లు క్వాలిఫై అయి సూపర్ 7 దశకు చేరితే అక్కడ రెండోసారి తలపడే లక్కీ ఛాన్స్ దక్కుతుంది.

**2028 టీ20 ప్రపంచకప్:**

ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ ఆతిథ్యమివ్వనున్న 2028 టీ20 ప్రపంచకప్ కూడా 20 జట్లతోనే కొనసాగినప్పటికీ, దీని ఫార్మాట్‌లో ఉత్కంఠను రెట్టింపు చేసేలా మార్పులు చేశారు.

**గ్రూప్ దశ:** గతంలో నాలుగు గ్రూపులుగా ఉన్న 20 జట్లను, ఇప్పుడు ఐదు గ్రూపులుగా (గ్రూప్‌నకు 4 జట్లు చొప్పున) విభజిస్తారు. ప్రతి గ్రూప్ నుంచి టాప్-2 స్థానాల్లో నిలిచిన జట్లు (మొత్తం 10 జట్లు) సూపర్ 10 దశకు చేరుకుంటాయి.

**సూపర్ 10:** ఈ 10 జట్లను రెండు గ్రూపులుగా (గ్రూప్‌నకు 5 చొప్పున) విభజిస్తారు. ఈ రెండు గ్రూపుల్లో అగ్రస్థానంలో (1వ స్థానం) నిలిచిన జట్లు నేరుగా సెమీఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి.

**ఎలిమినేటర్స్:** మిగిలిన రెండు సెమీఫైనల్ స్థానాల కోసం సరికొత్తగా ఎలిమినేటర్స్ రౌండ్ ప్రవేశ పెట్టారు. ఒక గ్రూప్‌లోని రెండో స్థానంలోని జట్టు, మరో గ్రూప్‌లోని మూడో ప్లేస్ లోని టీమ్ తో తలపడుతుంది. వీటిలో విజేతలుగా నిలిచిన రెండు జట్లు మిగిలిన రెండు సెమీఫైనల్ స్థానాలను భర్తీ చేస్తాయి. ఆ తర్వాత సెమీఫైనల్స్, ఫైనల్స్ మ్యాచ్‌లు జరుగుతాయి. కాగా ఐసీసీ తీసుకున్న ఈ సమూల మార్పులు టోర్నీ ప్రారంభం నుంచే ప్రతి ఒక్క మ్యాచ్‌ను చావో రేవో తేల్చుకునేలా చేసి, ప్రేక్షకులకు మంచి వినోదాన్ని అందించడం ఖాయంగా కనిపిస్తోంది.

## లంకా ప్రీమియర్ లీగ్ 2026 షెడ్యూల్ రిలీజ్.. జట్లు, లైవ్ స్ట్రీమింగ్, కొత్త రూల్స్ ఇవే!




**హైదరాబాద్ పెన్ పవర్:** క్రికెట్ అభిమానులకు సరికొత్త టీ20 వినోదాన్ని అందించేందుకు లంక ప్రీమియర్ లీగ్ 6వ ఎడిషన్ సిద్ధమైంది. రేపటి (జూలై 17) నుంచి ఆగస్టు 8 వరకు శ్రీలంక వేదికగా ఈ ప్రతిష్టాత్మక లీగ్ జరగబోతోంది. గత 2025 ఎడిషన్ శ్రీలంక బోర్డు టీ20 ప్రపంచకప్ వేదికల సన్నద్ధత కోసం రద్దు చేయడంతో.. ఈసారి సరికొత్త జోష్‌తో టోర్నీ తిరిగి రాబోతోంది. కొలంబో, దంబుల్లా, పల్లెకెలె వేదికలుగా మొత్తం 24 మ్యాచ్‌లు జరగనున్నాయి. ఈ టోర్నీలో ఐదు ఫ్రాంచైజీలు తలపడనున్నాయి. డిఫెండింగ్ ఛాంపియన్స్ జాఫ్నా కింగ్స్, గాలే గ్యాలెంట్స్ మధ్య కొలంబోలోని ఎస్ఎస్‌సీ (రాజ) మైదానంలో తొలి మ్యాచ్‌తో ఈ మెగా టోర్నీ అట్టహాసంగా ప్రారంభం కానుంది.

**ఐదు జట్లు:**

ఈసారి టోర్నమెంట్‌లో పాల్గొనే జట్ల యాజమాన్యాలు మారడంతో పాటు వాటి పేర్లు కూడా ఆసక్తికరంగా మారాయి.

జాఫ్నా కింగ్స్ (ఝుటటఋ ఖఋఅస్త్రం): (గతంలో జాఫ్నా టైటాన్స్).

గాలే గ్యాలెంట్స్: (గతంలో గాలే మార్వెల్స్).

కొలంబో క్యాప్స్ : (గతంలో కొలంబో స్ట్రైకర్స్).

క్యాండీ రాయల్స్ : (గతంలో క్యాండీ ఫాల్కన్స్).

దంబుల్లా సిక్సర్స్: దినేష్ చండీమల్ కెప్టెన్సీలోని బలమైన జట్టు.

**సరికొత్త రూల్స్:**

ఈ సారి లంక ప్రీమియర్ లీగ్‌ను మరింత ఉత్కంఠభరితంగా మార్చేందుకు సరికొత్త నిబంధనలను తీసుకువచ్చారు.

ఇంపాక్ట్ సబ్ : ఐపీఎల్ తరహాలోనే ఎల్పీఎల్‌లో కూడా మొదటిసారిగా 'ఇంపాక్ట్ సబ్' నిబంధనను ప్రవేశపెడుతున్నారు.

అండర్-23 రూల్: ప్రతి జట్టు తమ ప్లేయింగ్ ౹×లో కనీసం ఒక అండర్-23 (23 ఏళ్ల లోపు) ఆటగాడిని తప్పనిసరిగా ఆడించాల్సిందే. ఇంపాక్ట్ సబ్ వాడినప్పటికీ మైదానంలో ఒక అండర్-23 క్రీడాకారుడు ఉండాల్సిందే.

స్లో ఓవర్ రేట్ పెనాల్టీ: మ్యాచులు త్వరగా ముగిసేలా స్లో ఓవర్ రేట్ వేసే కెప్టెన్లకు కఠినమైన పెనాల్టీలు విధించనున్నారు.

**ప్లేఆఫ్స్ వివరాలు:**

లీగ్ దశలో ఐదు జట్లు మిగిలిన జట్లతో రెండేసి మ్యాచ్‌లు (డబుల్ రౌండ్-రాబిన్) ఆడుతాయి.

లీగ్ ముగిసే సమయానికి పాయింట్ల పట్టికలో మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లు ప్లేఆఫ్స్‌కు అర్హత సాధిస్తాయి.

క్వాలిఫైయర్ 1: పాయింట్ల పట్టికలో 1, 2 స్థానాల్లోని జట్ల మధ్య పోరు జరుగుతుంది. గెలిచిన జట్టు నేరుగా ఫైనల్‌కు వెళ్తుంది.

ఎలిమినేటర్: 3, 4 స్థానాల్లోని జట్ల మధ్య పోరు జరుగుతుంది. ఇందులో ఓడిన జట్టు టోర్నీ నుంచి నిష్క్రమిస్తుంది.

క్వాలిఫైయర్ 2: క్వాలిఫైయర్ 1లో ఓడిన జట్టు, ఎలిమినేటర్ విజేత మధ్య మ్యాచ్ జరుగుతుంది. ఇందులో గెలిచిన జట్టు ఫైనల్ కి వెళ్తుంది.

**ఎల్పీఎల్ 2026 పూర్తి షెడ్యూల్:**

జూలై 17: జాఫ్నా కింగ్స్ జం గాలే గాలెంట్స్

జూలై 18: క్యాండీ రాయల్స్ జం దంబుల్లా సిక్సర్స్, గాలే గాలెంట్స్ జం కొలంబో కాప్స్

జూలై 19: దంబుల్లా సిక్సర్స్ జం జాఫ్నా కింగ్స్, కొలంబో కాప్స్ జం క్యాండీ రాయల్స్

జూలై 21: దంబుల్లా సిక్సర్స్ జం క్యాండీ రాయల్స్

జూలై 22: జాఫ్నా కింగ్స్ జం కొలంబో కాప్స్, దంబుల్లా సిక్సర్స్ జం గాలే గాలెంట్స్

జూలై 23: క్యాండీ రాయల్స్ జం కొలంబో కాప్స్, గాలే గాలెంట్స్ జం జాఫ్నా కింగ్స్

జూలై 25: గాలే గాలెంట్స్ జం క్యాండీ రాయల్స్, దంబుల్లా సిక్సర్స్ జం కొలంబో కాప్స్

జూలై 26: క్యాండీ రాయల్స్ జం జాఫ్నా కింగ్స్, గాలే గాలెంట్స్ జం దంబుల్లా సిక్సర్స్

జూలై 28: కొలంబో కాప్స్ జం జాఫ్నా కింగ్స్

జూలై 29: గాలే గాలెంట్స్ జం క్యాండీ రాయల్స్, కొలంబో కాప్స్ జం దంబుల్లా సిక్సర్స్

జూలై 30: జాఫ్నా కింగ్స్ జం క్యాండీ రాయల్స్

ఆగస్టు 1: కొలంబో కాప్స్ జం గాలే గాలెంట్స్

ఆగస్టు 2: జాఫ్నా కింగ్స్ జం దంబుల్లా సిక్సర్స్

ఆగస్టు 5: క్వాలిఫయర్ 1 (మధ్యాహ్నం 3:00), ఎలిమినేటర్ (రాత్రి 7:30)

ఆగస్టు 7: క్వాలిఫయర్ 2

ఆగస్టు 8: ఫైనల్

**లైవ్ స్ట్రీమింగ్ వివరాలు:**

భారతదేశంలోని క్రికెట్ అభిమానులు ఈ టోర్నమెంట్‌ను స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్ ఛానెళ్లలో టీవీ ద్వారా ప్రత్యక్ష ప్రసారంగా వీక్షించవచ్చు. అలాగే డిజిటల్ మొబైల్ వీక్షకులు ఫ్యాన్‌కోడ్ యాప్, వెబ్‌సైట్ ద్వారా లైవ్ స్ట్రీమింగ్ ఆస్వాదించవచ్చు. శ్రీలంకలో SLTMobitel/PEOTV ద్వారా ఈ ప్రసారాలు అందుబాటులో ఉంటాయి.



పూజా హెగ్డే గ్రేస్, గ్లామర్ మరియు పెరుగుతున్న స్టార్‌డమ్

## సమంత సీమ వంటకాలు నేర్చుకుంటుందా?



సమంత వ్యక్తిగత జీవితంలో తీసుకుంటున్న మార్పులు - అభిరుచులు సినీ వర్గాల్లో ఆసక్తికరంగా మారుతున్నాయి. నాగ చైతన్యతో వివాహం జరిగిన సమయంలో తనకు వంట చేయడం పెద్దగా రాదని, వంట గదిలో గడపడం కంటే పని మీదనే ఎక్కువ దృష్టి పెడతానని బహిరంగంగానే వెల్లడించారు. తాజాగా అదే సమంత మనసంతా వంటగదిపైనే ఉందన్నది ఇప్పుడు అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. ప్రస్తుతం రాయలసీమ రుచులను నేర్చుకోవడంలో నిమగ్నమైందని తెలిసింది. రాయలసీమ వంటకాలు అనగానే ఘాటైన మసాలాలు, ప్రత్యేకమైన తయారీ పద్ధతులు గుర్తుకొస్తాయి.సామ్ సన్నిహితుల ద్వారా అందుతున్న సమాచారం ప్రకారం సమంత ఎంతో శ్రద్ధగా ఈ వంటకాలను నేర్చుకుంటున్నారు. ముఖ్యంగా సీమ రుచుల ప్రత్యేకతను ఎంతో ఎంజాయ్ చేస్తున్నారని తెలిసింది. ఒకప్పుడు వంటకు దూరంగా ఉన్న సమంత ఇప్పుడు ఇష్టంగా వంటగదిలో సమయం గడపడం అభిమానుల్ని సర్ ప్రైజ్ చేస్తుంది. సమంత ఈ నిర్ణయం తీసుకోవడానికి ఆమె వ్యక్తిగత జీవితంలో జరిగిన పరిణామాలే కారణమని నెటిజన్లు భావిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో సమంత ఇంటికే పరిమితమై, ప్రశాంతమైన జీవనాన్ని గడుపుతున్నారు.గర్భవతి కావడంతో ఈ సమయంలో బయట తిరుగుళ్లు తగ్గించి ఇంట్లోనే ఉండటం ఆమెకు వంటపై ఆసక్తిని పెంచేలా చేసిందని తెలుస్తోంది. ఇంటి వాతావరణం, కుటుంబ సభ్యుల మధ్య గడపడం కొత్త అనుభూతిని అందిస్తుందని చెప్పొచ్చు. నటిగా కెరీర్‌లో బిజీగా ఉన్నప్పుడు వంటపై దృష్టి పెట్టడం కుదరకపోవచ్చు. కానీ ఇప్పుడు లభించిన విరామ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. వంట కేవలం ఆకలి తీర్చుకోవడం మాత్రమే కాదు. అది ఒక కళ అని దానిని ఆస్వాదిస్తూ చేయడం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందని సమంత కూడా భావిస్తున్నట్లు కనిపిస్తోంది. ఆరోగ్యకరమైన, రుచికరమైన ఇంటి భోజనం గర్భవతిగా ఆమెకు ఎంతో మేలు చేకూరుస్తుంది. తెలుగు వ్యక్తిని వివాహం ( రాజ్ నిడిమోరు) చేసుకున్న తర్వాత సంప్రదాయాలు , రుచులపై సమంతకు మక్కువ పెరిగిందని చెప్పడంలో సందేహం లేదు. తెలుగు వంటకాలకు, ముఖ్యంగా సీమ వంటకాలకు ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఆ రుచులను స్వయంగా వండి రుచి చూడటంలో ఉన్న తృప్తి వేరే ఏ ఆహారంలోనూ ఉండదు. సమంత వంటకాలను వండి కుటుంబ సభ్యులకు వడ్డించడంలో ఓ కొత్త ఆనందాన్ని పొందుతున్నారని సన్నిహితులు చెబుతున్నారు. ఇటీవలే రిలీజ్ అయిన -మా ఇంటి బంగారం- చిత్రంలో నక్సలైట్...ఓ ఇంటి కోడలి పాత్రలో ఎలా అరించారో? తెలిసిందే. వంట తెలియని సమంత వంటల్లో స్పెషలిస్ట్ అని చెప్పుకుని కుటుంబంలో హైలైట్ అవుతుంది. అది రీల్ సీన్ అయినా? ఇప్పుడు రియల్ గా రాయలసీమ వంటకాలు నేర్చుకుంటూ రియల్ గానూ అత్తింటి కుటుంబంలో మంచి వంట గత్తెను అనిపించ ుకుంటోంది.



ఎమరాల్డ్ కార్సెట్ లుక్‌లో రాశి ఖన్నా తలదాచుకుంది

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers, Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 1-17-1, Badeti Ramana Street, Near Mla House, 30th Word, Thadepalligudem , Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2834, E-Mail : Editorpenpower@Gmail.Com, Mobile: 9059465965